ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 4
సంచిక : 52

సోమవారం 1 సెప్టెంబర్ 2025 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## సూపర్ 4కు భారత్

హర్మన్‌ప్రీత్ డబుల్.. 3-2తో జపాన్‌పై గెలుపు.. ఆసియాకప్ హాకీ




7



## ఇక మనం పోటీదారులం కాదు..
# భాగస్వాములం

సమస్యను సహేతుకంగా తేల్చుకుందాం
సరిహద్దు సమస్య మన బంధానికి అడ్డురావొద్దు
ఇరుదేశాల మధ్య వాణిజ్యం పెంచుకుందాం
శత్రువుల్లా కాదు.. అభివృద్ధి భాగస్వాములుగా
రాజకీయ, వ్యూహాత్మక కోణంలో సాగుదాం
ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నిర్ణయం
బంధం బాగుండాలంటే శాంతి, స్థిరత్వం ముఖ్యం
భారత్, చైనా మధ్య సహకారం మానవాళి
సంక్షేమానికి బాటలు వేస్తుంది: మోదీ

భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సు సందర్భంగా చైనాలోని తియాంజిన్‌లో ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య నెలకొన్న పలు కీలక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి.



## స్వదేశీ ఉత్పత్తులే ముద్దు!

ట్రంప్ సుంకాల వేళ మోదీ పిలుపు..
ఆత్మనిర్భరతతో అగ్రదేశంగా మారదాం!
బహుమతులు, వస్త్రాలు, అలంకార సామగ్రి.. దేశీయ వస్తువులనే వాడండి
ప్రధానంగా పండుగల్లో ఇవే వినియోగించండి..
'మన్ కీ బాత్'లో ప్రధాని

04



## సీబీఐ విచారణకు
# కాళేశ్వరం

### విచారణకు అప్పగించాలని అసెంబ్లీ నిర్ణయం.. సీఎం ప్రకటన

లక్ష కోట్లు దోచుకున్న దోపిడీ దొంగ కేసీఆర్
ప్రజాస్వామ్యం కాబట్టి నడి బజారులో ఉరి తీయలేదు
కేంద్ర సంస్థలు, అంతర్రాష్ట్ర అంశాలు ఇమిడి ఉన్నందున సీబీఐకి అప్పగించడమే మంచిదని నిర్ణయించాం: సీఎం రేవంత్

**హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనిని సీబీఐ విచారణకు అప్పగించాలని నిర్ణయించింది. బ్యారేజీలపై జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. దీనిపై సమగ్రంగా చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. ఆదివారం అర్ధరాత్రి దాటాక శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని వెలువరించారు. ఈ సందర్భంగా విచారణను సీబీఐకి అప్పగించడానికి

మిగతా 2 లో



## బీఆర్ఎస్ వల్లే ఆగిన బిల్లులు!

బీసీ రిజర్వేషన్ బిల్లులను రాష్ట్రపతికి పంపడం వెనక బీఆర్ఎస్ పాత్ర
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

02

## ఘోష్ నివేదిక
# అంతా ట్రాష్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్.. గన్‌పార్క్ వద్ద నిరసన..



కాంగ్రెస్ కుట్రలను ఎండగడతామన్న కేటీఆర్, హరీశ్
చెత్త నివేదిక.. చిత్తుకాగితంతో సమానం
రాజ్యాంగం కల్పించిన హక్కుగా కోర్టుకెళ్తే తప్పేంటి?
ప్రభుత్వం నడుపుతున్నారా? సర్కస్ కంపెనీనా?: హరీశ్
ప్రతిపక్ష బీఆర్ఎస్ తరపున 'ఒకే ఒక్కడు'గా ప్రసంగం

అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాళేశ్వరం కమిషన్ నివేదిక ఏకపక్షమని, అందులో అబద్ధాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. దీనిపై సభలో వివరణ ఇవ్వడానికి తమకు మాట్లాడే అవకాశం ఇవ్వట్లేదని ఆరోపిస్తూ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. ఆదివారం రాత్రి అసెంబ్లీ నుంచి గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు.

### సీఎం రేవంత్ ఢిల్లీలో దీక్ష చేయాలి

ఒకే అంశంపై 5 రకాలుగా మాట్లాడుతున్నారు
ఆర్డినెన్స్‌పై సంతకం పెట్టని గవర్నర్ అసెంబ్లీ తీర్మానాన్ని ఎలా ఆమోదిస్తారు?: కేటీఆర్


## వరద బాధితులకు
# బీజేపీ అండ

ఎంపీ నిధుల నుంచి రూ.80 లక్షలు సాయం..
కాంగ్రెస్ చేతులెత్తేసింది: రాంచందర్‌రావు
17న హైదరాబాద్ లిబరేషన్ డే
పరేడ్ గ్రౌండ్‌లో వేడుక
హాజరుకానున్న రాజ్‌నాథ్: కిషన్‌రెడ్డి



**హైదరాబాద్ :** రాష్ట్రంలో భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఆరుగురు బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి ఒక్కొక్కరు రూ.10 లక్షల చొప్పున రూ.80 లక్షలు కేటాయించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

మిగతా 2 లో



## బ్యాంకు బంగారం తాకట్టు పెట్టి
# క్రికెట్ బెట్టింగ్

ఏకంగా 25 కిలోల పసిడి తాకట్టు
మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్‌బీఐ మేనేజర్, క్యాషియర్ నిర్వాకం
నిందితుల వద్ద నుంచి 15 కిలోల బంగారం, రూ.1.61లక్షలు స్వాధీనం
సూత్రధారితోపాటు 44 మంది అరెస్టు

03



02

# ఐఎండీ అప్ డేట్

## సెప్టెంబరులో కూడా దంచికొట్టనున్న వర్షాలు!

సెప్టెంబర్ నెలలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు
దీర్ఘకాలిక సగటులో 109% కంటే ఎక్కువగా వానలు
ఈశాన్య, తూర్పు, దక్షిణ కొన్ని ప్రాంతాల్లో మాత్రం తక్కువ వర్షాలు
వ్యవసాయ రంగానికి మేలు, కానీ వరదల ముప్పు పొంచి ఉంది
అధికారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచన

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
1 సెప్టెంబర్
2025





# వరద బాధితులకు బీజేపీ అండ

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. తమ ఎంపీలు తక్షణమే ముందుకు వచ్చి సహాయక చర్యల కోసం నిధులను కేటాయించడం ప్రశంసనీయమని అన్నారు. వర్షాలతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలంటూ రాంచందర్‌రావు ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సిరిసిల్ల జిల్లా ప్రజలకు రూ.10 లక్షలు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఎంపీ లాడ్స్ నిధుల నుండి ఈ మొత్తాన్ని సిరిసిల్ల కలెక్టర్‌కు త్వరలోనే ఇస్తానని పేర్కొన్నారు.



### మోదీ తల్లి పట్ల కాంగ్రెస్ వ్యాఖ్యలు సరికాదు: కిషన్ రెడ్డి

ప్రధాని మోదీ తల్లి పట్ల కాంగ్రెస్ నాయకులు, రాహుల్ గాంధీ మానవత్వం లేకుండా మాట్లాడారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అలాంటి నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఆదివారం బోరబండలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భారతదేశంలో విలీనం కావడానికి సర్దార్ పటేల్ చేసిన కృషిని మోదీ మన్ కీ బాత్‌లో ప్రస్తావించారని తెలిపారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో హైదరాబాద్ లిబరేషన్ డేను నిర్వహించనున్నామని, ఆ కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరవుతారని వెల్లడించారు. అలాగే విశ్వకర్మ దివ్‌సను జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటామని, అదే రోజు ప్రధాని మోదీ పుట్టిన రోజు కూడా కావడంతో తెలంగాణలో 3ముఖ్యమైన కార్యక్రమాలను ఒకే రోజున నిర్వహిస్తామని చెప్పారు. కాగా, ఖైరతాబాద్ మహాగణపతిని ఆదివారం సాయంత్రం కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఖైరతాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఆదర్శ్ వంశీకర్ తయారు చేయించిన 26 కిలోల లడ్డూను గణేషుడికి సమర్పించారు.

#### రాహుల్ దిష్టిబొమ్మ దహనం

ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి డిమాండ్ చేశారు. బిహార్‌లో రాహుల్, ప్రియాంక సమక్షంలోనే కాంగ్రెస్ నేతలు మోదీ తల్లిపై దుర్భాషలాడటం దేశ ప్రజల మనసును కలచివేసిందన్నారు. ఆ వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద మహిళా మోర్చా నేతలు ధర్నా నిర్వహించారు. రాహు ల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

# ఐఎండీ అప్ డేట్

**సెప్టెంబర్ నెలలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు**

**దీర్ఘకాలిక సగటులో 109% కంటే ఎక్కువగా వానలు**

**ఈశాన్య, తూర్పు, దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం తక్కువ వర్షాలు**

**వ్యవసాయ రంగానికి మేలు, కానీ వరదల ముప్పు పొంచి ఉంది**

**పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదు**


**అధికారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచన**



దేశంలోని అనేక ప్రాంతాలు ఇప్పటికే వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి వైపరీత్యాలతో సతమతమవుతున్న వేళ, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కీలక ప్రకటన చేసింది. రాబోయే సెప్టెంబర్ నెలలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఆదివారం విడుదల చేసిన తన నెలవారీ నివేదికలో స్పష్టం చేసింది. ఐఎండీ అంచనాల ప్రకారం, సెప్టెంబర్ నెలలో వర్షపాతం దీర్ఘకాలిక సగటు కంటే 109 శాతానికి పైగా నమోదవుతుందని పేర్కొంది. 1971 నుంచి 2020 వరకు ఉన్న డేటా ఆధారంగా, సెప్టెంబర్ నెల దీర్ఘకాలిక సగటు వర్షపాతం 167.9 మిల్లీమీటర్లుగా ఉంది. ఈసారి దీనికంటే ఎక్కువ వర్షపాతం కురవనుందని ఐఎండీ తెలిపింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం నుంచి అధిక వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అయితే, ఈశాన్య, తూర్పు భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, దక్షిణ ద్వీపకల్పంలోని చాలా భాగాలు, ఉత్తర భారతదేశంలోని కొన్ని సరిహద్దు ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని నివేదికలో వివరించింది. సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవడం వల్ల వ్యవసాయ రంగానికి, నీటి వనరులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఐఎండీ అభిప్రాయపడింది. అదే సమయంలో వరదలు, కొండచరియలు విరిగిపడటం, రవాణా వ్యవస్థకు అంతరాయాలు, ప్రజారోగ్య సమస్యలు వంటి ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని హెచ్చరించింది. ఈ నష్టాలను నివారించడానికి మౌలిక సదుపాయాలను బలోపేతం చేసుకోవాలని, వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలను ఉపయోగించుకోవాలని, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించింది. ఇక ఉష్ణోగ్రతల విషయానికొస్తే, సెప్టెంబర్ నెలలో పశ్చిమ-మధ్య, వాయువ్య, దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని ఐఎండీ అంచనా వేసింది. తూర్పు-మధ్య, తూర్పు, ఈశాన్య భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో మాత్రం ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

# సీబీఐ విచారణకు కాళేశ్వరం

మొదటి పేజీ తరువాయి



కారణాలను ఆయన వివరించారు. "కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించేందుకు తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. నివేదికను జూలై 31న ప్రభుత్వానికి అందిస్తే... ఆగస్టు 4న మంత్రివర్గం ఈ నివేదికను ఆమోదించింది. తదుపరి మంత్రివ ర్గం నిర్ణయంతో అసెంబ్లీలో పెట్టి, చర్చ చేపట్టాం. కమిషన్ క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలని సిఫారసు చేసింది. విచారణలో అనేక లోపాలు, అవకతవకలు గుర్తించింది. నిర్లక్ష్యం, దురుద్దేశం, ఉద్దేశపూర్వకంగా వాస్తవాలు తొక్కిపెట్టడం, ఆర్థిక అవకతవకల అంశాన్ని ప్రస్తావించింది. ప్లానింగ్ లేదని తేల్చింది. ఎన్‌డీఎసఏ నివేదిక ప్రకారం మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి క్వాలిటీ కంట్రోల్, నాణ్యత, నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల లోపాలు ఏర్పడ్డాయని ఎన్‌డీఎసఏ గుర్తించింది. ఈ అంశాలపై మరింత లోతుగా, మరింత సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఎన్‌డీఎసఏ, కమిషన్ నివేదికలు స్పష్టం చేశాయి.

ఈ ప్రాజెక్టులో అంతరాష్ట్ర అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలు, ఏజెన్సీలు పాలుపంచుకున్నాయి. ప్రాజెక్టు డిజైన్, వ్యాప్కోస్ వంటి కేంద్ర సంస్థలు, పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీ ఆర్థిక సంస్థలు పాల్పంచుకున్నందున ఈ కేసును సీబీఐకి అప్పగించడం సముచిత మని నిర్ణయంతీసుకున్నాం. అందుకే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని సభ నిర్ణయం తీసుకుంటుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నో రకాల అంశాలు, విచారణకు అర్హమైన అంశాలు ఉన్నందున సీబీఐ విచారణకు అప్పగించాలని నిర్ణయించామన్నారు. ధవళేశ్వరంపై ప్రాజెక్టు కట్టిన సర్ ఆర్థర్ కాటన్‌ను ప్రజలు కాటన్ దొర అని దేవుడిలా పూజిస్తుంటే.. దొరగా పుట్టానని గొప్పగా చెప్పుకొనే కేసీఆర్ .. తెలంగాణలో దోపిడీ దొంగగా మారారని ఆరోపించారు. కాళేశ్వరంలో ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ కుటుంబం రూ.లక్ష కోట్లు దోచుకుందని, రాష్ట్రప్రజలపై లక్షన్నర కోట్ల అప్పుల భారం వేసిందని అన్నారు. ప్రజాస్వామ్య దేశమైనందున.. కేసీఆర్ చేసిన పాపాలకు నడి బజారులో ఉరి తీయలేమని, రాళ్లతో కొట్టలేమని పేర్కొన్నారు. అందరి అనుమతితో నిర్ణయం తీసుకోవాలనే ఈరోజు అర్ధరాత్రి సమావేశం పెట్టామన్నారు.

#### కాళేశ్వరంపై రూ. 49835 కోట్లు అప్పు కట్టాం..

ముఖ్యమంత్రిగా కేసీఆర్ కాళేశ్వరం కోసం రూ. 87,449 కోట్లు అప్పులు తెచ్చారని సీఎం రేవంత్ తెలిపారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, నాబార్డ్, విజయ బ్యాంకుల నుంచి 14 ఏళ్ల కాలానికి అత్యధికంగా 11.5 శాతం వడ్డీకి తెచ్చారని పేర్కొన్నారు. ఆ నిధులతోనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టారన్నారు. అసలు, వడ్డీలు కలిపి ఇప్పటివరకు రూ.49,835 కోట్లు చెల్లించామని, ఇంకా రూ.60,769 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు. పెండింగులో ఉన్న పనులు పూర్తిచేయాలంటే ఇంకా రూ.47 వేల కోట్లు కావాలన్నా రు. కాగా, అర్ధరాత్రి దాటిన తరువాత 1.40 గంటలకు సభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

# బీఆర్ఎస్ వల్లే ఆగిన బిల్లులు!

**బీసీ రిజర్వేషన్ బిల్లులను రాష్ట్రపతికి పంపడం వెనక బీఆర్ఎస్ పాత్ర**

**గత ప్రభుత్వం తెచ్చిన చట్టాలే నేడు గుదిబండలుగా మారాయి**

**వాటిని అధిగమించేందుకు ఆర్డినెన్స్ తెస్తే గవర్నర్ ఆమోదించకుండా చేశారు**

**కల్వకుంట్ల కుటుంబం కాదు.. ఎవరినీ కలవకుండా చేసే కుటుంబం**

**రిజర్వేషన్లపై ఆ పార్టీకి సంతోషం లేదు.. ఢిల్లీ ధర్నాలో ఎందుకు పాల్గొనలేదు?**

**శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు**

**రిజర్వేషన్లపై.. నేడు గవర్నర్ వద్దకు కాంగ్రెస్**



**హైదరాబాద్, ఆగస్టు 31:** రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ బిల్లులు గవర్నర్ ఆమోదం పొందకుండా వాటిని రాష్ట్రపతికి పంపడం వెనక బీఆర్ఎస్ పాత్ర ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీసీలకు విద్య, ఉద్యోగ అవకాశాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో రెండు బిల్లులను ఆమోదించి, గవర్నర్‌కు పంపితే.. వాటిని రాష్ట్రపతికి పంపారని తెలిపారు. ఐదు నెలలుగా అవి రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ప్రస్తుత గవర్నర్ ఒకప్పుడు ఆర్థిక మంత్రిగా పనిచేశారని, గతంలో తెలంగాణ రాష్ట్రానికి ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఓ వ్యక్తి.. బీసీ బిల్లులను రాష్ట్రపతికి పంపేలా గవర్నర్ వద్ద తెరవెనుక లాబీయింగ్ చేశారని చెప్పారు. ఆదివారం శాసనసభలో మునిసిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టం, 2019లో తెచ్చిన మునిసిపల్ చట్టం.. స్థానిక సంస్థల్లో 50 శాతంలోపే రిజర్వేషన్లు ఉండాలని చెబుతున్నాయన్నారు. అవే ఇప్పుడు పెద్ద గుదిబండలుగా మారాయన్నారు. ఆ అడ్డంకులను అధిగమించి, స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని, దాన్ని మళ్లీ గవర్నర్‌కు పంపామని తెలిపారు. అయితే ఈ ఆర్డినెన్స్‌ను ఆమోదించే విషయంలో కూడా గవర్నర్ బీఆర్ఎస్ మాటలు నమ్మారని అన్నారు.

#### బీసీలను బీసీలే అవమానించుకోవద్దు..

స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యాయంటూ కొందరు కోర్టుకు వెళ్లారని సీఎం రేవంత్ తెలిపారు. దీంతో సెప్టెంబరు 30లోగా ఎన్నికలు నిర్వహించాలని, రిజర్వేషన్లు సైతం ఖరారు చేయాలని న్యాయస్థానం ఆదేశించిందన్నారు. ఉన్న చట్టాలను పరిశీలిస్తే 50 శాతం రిజర్వేషన్లకు లోబడి ఎన్నికలు నిర్వహించాలని చెబుతున్నాయని పేర్కొన్నారు. అందుకే తమ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చి 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని గవర్నర్‌కు పంపిందని అన్నారు. ఆర్డినెన్స్ ఆమోదం పొందనందున.. శాసనసభలో రిజర్వేషన్ల బిల్లు పెట్టి ఆమోదించుకుందామని పిలుపునిచ్చారు. సభా నాయకుడిగా చిత్తశుద్ధితో దీనిని అమలు చేసే బాధ్యత తనదన్నారు. దీనిని చిలువలు, పలువలు చేయవద్దని, బీసీలను బీసీలే అవమానించుకోవద్దని హితవు పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఒకరినొకరు విమర్శించుకుంటే ఇతరుల ముందు పలుచన అవుతారని వ్యాఖ్యానించారు. మంచి జరిగేటప్పుడు కలిసికట్టుగా ఉండాలని సూచించారు. అలా కాకుండా యజమానులను ఒప్పించడానికి, సంతోషపెట్టడానికి మంత్రులపై పరుషమైన పదజాలం ప్రయోగించవద్దని గంగులకు హితవు పలికారు. సభను వేదికగా మార్చుకొని బలహీన వర్గాలకు అనుమానం కలిగించేలా, తెలంగాణ సమాజంలో అపోహలు సృష్టించేలా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దన్నారు.

#### వాళ్లకు సంతోషం లేదు..

బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తుంటే వారికి (బీఆర్ఎస్ నేతలకు) సంతోషం లేదని సీఎం రేవంత్ అన్నారు. వారి కడుపు నిండా దుఃఖం, బాధ, విషం ఉన్నాయని ఆరోపించారు. ఢిల్లీకి అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకెళ్లలేదంటూ గంగుల ప్రశ్నిస్తున్నారని, అయితే ప్రధానికి తాను ఐదుసార్లు లేఖ రాసి.. అపాయింట్‌మెంట్ అడిగితే ఇవ్వలేదని తెలిపారు. దీంతో ప్రధానిపై, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో జంతర్‌మంతర్ వద్ద తాము ఆందోళన చేశామని గుర్తు చేశారు. అందులో వందమంది ఎంపీలు పాల్గొన్నారని, కానీ.. బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీలు ఎందుకు పాల్గొనలేదని సీఎం ప్రశ్నించారు. బీఆర్ఎస్ అబద్ధాల ప్రాతిపదికన మాట్లాడుతోందని మండిపడ్డారు. బీఆర్ఎసకు కనువిప్పు కలిగించేందుకే ఫిబ్రవరి 4న సోషల్ జస్టిస్ డే జరుపుకోవాలని నిర్ణయించామన్నారు. బీఆర్ఎస్ తప్పులు చేసినందునే ప్రజలు శిక్ష విధించారని, ప్రజాతీర్పు మేరకు ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రజలకిచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తామని, ఇందుకు బీఆర్ఎస్ సహకరించాలని కోరారు. బుద్ధి మారకపోతే ప్రజలు మళ్లీ ఇంకో తీర్పు ఇస్తారని, ఈసారి ప్రతిపక్ష హెూదా కూడా ఉండదని హెచ్చరించారు. బీఆర్ఎస్ తమకు సుద్దులు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ముందుగా వారి నాయకుణ్ని (కేసీఆర్) వచ్చి సభలో కూర్చోవాలని చెప్పాలన్నారు. బీసీలకు న్యాయం చేయాలని వందేళ్లుగా జరగని కులగణనను కాంగ్రెస్ సర్కారు చేసిందని రేవంత్ అన్నా రు. దానిని ప్రధానప్రతిపక్ష నేత అభినందిస్తే.. ఆయన పెద్దరికం పెరిగి ఉండేదన్నారు. ఆయన సభకు రారని, ఆయన పంపిన వారేమో అవాస్తవాలు మా ట్లాడుతున్నారని మండిపడ్డారు.

#### కర్రుకాల్చి వాత పెట్టాను

బీసీ రిజర్వేషన్ల విషయంలో కేసీఆర్ ఒత్తిడికి లొంగవద్దని గంగులకు సీఎం రేవంత్ సూచించారు. బీఆర్ఎస్ పోకడలు ఎలా ఉంటాయో తనకు తెలుసునని, అందుకే వారికి కర్రుకాల్చి వాత పెట్టి సీఎంను అయ్యాయనన్నారు. బీసీ బిల్లుపై రాజకీయ వివాదాలకు తావు లేకుండా, ఆరోపణలు చేయకుండా సూచనలు చేయాలని కోరారు. "కల్వకుంట్ల కుటుంబం అంటే ఎవరినీ కలవకుండా ఉంచడం. బీసీలు, ఓసీలు కలవద్దని, ఎస్సీలు, ఎస్టీలు కలవద్దని, మైనారిటీలు, హిందువులు కలవద్దనే కుటుంబం"అని సీఎం వ్యాఖ్యానించారు. బీసీ బిల్లుపై చర్చ లేకుండా సభ అంతా ఏకగ్రీవంగా ఆమోదిస్తే కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి అవకాశముంటుందన్నారు. ప్రధాని అపాయింట్‌మెంట్‌ను బీజేపీ మిత్రుడు పాయల శంకర్ ఇప్పించాలని కోరారు. అపాయింట్‌మెంట్ ఇప్పిస్తే అంతా కలిసివెళ్లి రాష్ట్రపతి వద్ద పెండింగ్ ఉన్న బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించుకుందామన్నారు.

#### బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం

రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు పంచాయతీరాజ్ చట్టం-2018 లోని సెక్షన్ 285(ఏ)ను సవరించి, 50 శాతం పరిమితిని తొలగించేందుకు ఆదివారం శాసనసభ లో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. బిల్లును సభలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై చర్చ జరిగిన అనంతరం సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 1 సెప్టెంబర్ 2025





# ఘోష్ నివేదిక అంతా ట్రాష్

**కాంగ్రెస్ కుట్రలను ఎండగడతామన్న కేటీఆర్, హరీశ్**

**చెత్త నివేదిక.. చిత్తుకాగితంతో సమానం**

**రాజ్యాంగం కల్పించిన హక్కుగా కోర్టుకెళ్తే తప్పేంటి?**

**ప్రభుత్వం నడుపుతున్నారా? సర్కస్ కంపెనీనా?: హరీశ్**

**ప్రతిపక్ష బీఆర్ఎస్ తరపున 'ఒకే ఒక్కడు'గా ప్రసంగం**



**హైదరాబాద్ :** అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాళేశ్వరం కమిషన్ నివేదిక ఏకపక్షమని, అందులో అబద్ధాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. దీనిపై సభలో వివరణ ఇవ్వడానికి తమకు మాట్లాడే అవకాశం ఇవ్వట్లేదని ఆరోపిస్తూ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. ఆదివారం రాత్రి అసెంబ్లీ నుంచి గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కక్షపూరితంగా తీసుకొచ్చిన కాళేశ్వరం ఘోష్ కమిషన్ నివేదిక అంతా ట్రాష్ అని, అందులో ఉన్నవన్నీ అబద్ధాలేనని ఆరోపిస్తూ నివేదిక ప్రతులు చించి చెత్తబుట్టలో వేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో తమ గొంతు నొక్కారని, స్పీకర్ ఏం సంబంధం లేనట్లు వ్యవహరించారని ఆరోపించారు. తమ నేత హరీశ్‌రావు ఒకరు మాట్లాడితే.. సీఎం సహా మంత్రులంతా అబద్ధాలు చెప్పారన్నారు. కాళేశ్వరంపై కుట్రను ప్రజల్లో ఎండగడతామని, ఆ ప్రాజెక్టును కూల్చి ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందని కేటీఆర్ అన్నారు. కమిషన్స్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టాన్ని ఉల్లంఘించి కాళేశ్వరంపై పీసీ ఘోష్ ఇచ్చిన చెత్త నివేదికపై న్యాయపోరాటం చేస్తామని, దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయిస్తామన్నారు.

### భట్టి ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాలకు దూరం: హరీశ్

బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపణలను రుజువు చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా ఉంటానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో 17 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్లు నిరూపిస్తే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై పీసీ ఘోష్ నివేదికపై అసెంబ్లీలో తాను మాట్లాడుతున్నప్పుడు సీఎంతోపాటు 8 మంది మంత్రులు తనను 33 సార్లు అడ్డుకున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎసపై బురద చల్లి ఏ విధంగా ఓట్లు రాబట్టుకోవాలనే ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఘోష్ నివేదిక ఏకపక్షమని, ఎన్‌డీఏకు అనుకూలంగా ఎన్‌డీఎసఏ నివేదిక ఉందని అసెంబ్లీలో వివరించామన్నారు. గంటన్నర సేపు స్పీకర్‌ను, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రిని ప్రాధే యపడినా తమకు మైక్ ఇవ్వలేదని ఆరోపించారు. కోర్టులో కొట్టుకుపోతుందన్న భయంతోనే ఆదివారం అసెంబ్లీ పెట్టి కాళేశ్వరం కమిషన్‌పై చర్చ పెట్టారని ఆయన విమర్శించారు.

## సీఎం రేవంత్ ఢిల్లీలో దీక్ష చేయాలి

**ఒకే అంశంపై 5 రకాలుగా మాట్లాడుతున్నారు**

**ఆర్డినెన్స్‌పై సంతకం పెట్టని గవర్నర్ అసెంబ్లీ తీర్మానాన్ని ఎలా ఆమోదిస్తారు?: కేటీఆర్**



**హైదరాబాద్ :** సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్షకు దిగి.. బీసీలకు రాష్ట్ర స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పించేలా పార్లమెంట్‌లో బిల్లును ఆమోదింపజేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. "రిజర్వేషన్లు పార్లమెంట్ పరిధిలోని అంశం. అంతేగానీ, అసెంబ్లీలో ఎంత గట్టిగా మాట్లాడినా.. పొలిటికల్ డైలాగులు కొట్టినా లాభం లేదు. ఈ విషయంపై ప్రధాని మోదీతో మాట్లాడేందుకు రాష్ట్రం నుంచి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి. అందుకు మేం సహకరిస్తాం. కాంగ్రెస-బీజేపీ తలచుకుంటే.. మోదీ-రాహుల్ కలిసి టీ తాగేలోపు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి, బీసీలకు న్యాయం చేయొచ్చు. పార్లమెంట్ ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చడం ఒక్కటే పరిష్కారం" అని వ్యాఖ్యానించారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డికి తెలిసినా.. ఆ దిశలో ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. 2018 పంచాయతీరాజ్ చట్ట సవరణతో 50% రిజర్వేషన్ల పరిమితిని తొలగించేందుకు ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లులపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో 5 రకాలుగా మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. "కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సందర్భంగా కేంద్రంలో అధికారంలోకి వస్తే చేస్తామని చెప్పి ఉండాల్సింది. అలా చేయకుండా.. హడావుడిగా ప్రకటించి, ఇప్పుడు చిత్తశుద్ధి లేనట్లు వ్యవహరిస్తోంది. రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లను సాధిస్తామని ఒకసారి చెప్పారు. ఆర్డినెన్స్ ద్వారా అంటూ మరోసారి చెప్పారు. పార్టీపరంగా అని ఇంకోసారి.. రాహుల్ ప్రధాని అయితేనే అని మరోమారు ప్రకటించారు. ఇప్పుడు మళ్లీ బిల్లు తీసుకొచ్చారు. ఒకే అంశంపై ఐదు రకాలుగా చెబుతుంటే.. బీసీలు అర్థం చేసుకోలేరా?" అని ప్రశ్నించారు. గతంలో పంపిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ సంతకం చేయలేదని, ఇప్పుడు శాసనసభ తీర్మానంపై ఎలా ఆమోదం వ్యక్తం చేస్తారని నిలదీశారు. "మార్చి నెలలో అసెంబ్లీ ఆమోదించి, రాష్ట్రపతికి పంపిన బిల్లుకు.. తాజా బిల్లుకు తేడా ఏంటో చెప్పాలి. సెప్టెంబరు 30లోపు రిజర్వేషన్లు ఇచ్చి, ఎన్నికలను ఎలా పూర్తిచేస్తారు? గవర్నర్‌తో సంతకం ఎలా చేయిస్తారు?" అనే విషయాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. కనీసం 15 రోజులైనా సభను నడపమని అడుగుతుంటే ప్రభుత్వం పారిపోతోందని ఎద్దేవా చేశారు.

## కేసీఆర్‌పై చర్యలు చేపట్టేందుకు సర్కారుకు స్వేచ్ఛ ఉంది

**కాళేశ్వరం అతిపెద్ద మానవ తప్పిదం.. లక్ష ఎకరాలకూ నీళ్లివ్వలేదు: ఉత్తమ్**

**హైదరాబాద్ :** గత ప్రభుత్వంలో బాధ్యతా రహితంగా నిర్మించిన కాళేశ్వరం తప్పిదాలకు నాటి సీఎం కేసీఆరే బాధ్యులని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నిపుణుల కమిటీ సూచనలను పట్టించుకోకుండా అక్రమంగా, అసంబద్ధంగా కాళేశ్వరం కట్టారని పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని చెప్పారు. కాళేశ్వరం నిర్మాణంతో రాష్ట్రానికి భారీగా ఆర్థిక నష్టం జరిగిందని, అక్రమాలకు పూర్తిబాధ్యత కేసీఆర్‌దేనని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సూచించిందని తెలిపారు. కేసీఆర్‌పై చట్టప్రకారం తగిన చర్యలు చేపట్టే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు. ఆదివారం శాసనసభలో ఆయన మాట్లాడారు. "సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టును మొదలుపెట్టినట్లు నివేదికలో ఉంది. కేసీఆర్ చెప్పినట్లే చేశామని అధికారులు వాంగ్మూలం ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించి కాంట్రాక్టర్లకు మేలు చేయడానికే పనులు అప్పగించారు. అప్పటి నేతలతోపాటు అధికారులు, ఇంజనీర్లు ఎవరెవరు బాధ్యులో కూడా కమిషన్ స్పష్టం చేసింది. 666 పేజీల కమిషన్ నివేదికను అసెంబ్లీ ముందుంచాం. సభ్యుల అభిప్రాయాల ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సీఎం రేవంత్ ప్రకటిస్తారు" అని ఉత్తమ్ తెలిపారు.

### కాళేశ్వరం అతిపెద్ద మానవతప్పిదం

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ప్రపంచంలోనే అతిపెద్ద మానవ తప్పిదమని ఉత్తమ్ విమర్శించారు. కాళేశ్వరానికి గుండెకాయలాంటి మేడిగడ్డ కూలడంతో రూ.21 వేల కోట్లు బూడిదలో పోసిన పన్నీరయ్యాయని ఆరోపించారు. 20 నెలలుగా అన్నారం సుందిళ్ల, మేడిగడ్డ నిరుపయోగంగా మారాయన్నారు. ప్రాణహిత-చేవెళ్లను 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని.. 2014నాటికి రూ.11 వేలకోట్లు ఖర్చుపెట్టారని ఉత్తమ్ గుర్తు చేశారు. రూ.38,500కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత చేవెళ్లను అకారణంగా మార్చి కాళేశ్వరం చేపట్టారని తెలిపారు. ఏడాదికి 195 టీఎంసీలు ఎత్తిపోస్తామని చెప్పి.. ఐదేళ్లలో 125 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారన్నారు. లక్ష కోట్లు ఖర్చుచేసినా ఐదేళ్లలో వాడుకున్న నీళ్లు 101 టీఎంసీలేనని, స్వతంత్ర దేశంలో ఇదో పెద్ద ఆర్థిక నష్టమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం నిర్వహణ పెనుభారంగా మారిందని, విద్యుత్ శాఖకు రూ.9,735కోట్లు చెల్లించాల్సి ఉందని వివరించారు. బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టు వారి హయాంలోనే కూలడంతో.. ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. తప్పు చేసిన వారెవరైనా సిగ్గుపడతారని, కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దబాయిస్తున్నారని విమర్శించారు.

## సభ జరగని సమయంలోనే ఆర్డినెన్స్

**కేటీఆర్ వ్యాఖ్యలకు సమాధానమిచ్చిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం**



**హైదరాబాద్ :** చట్టసభల సమావేశాలు జరగని సమయంలోనే ఆర్డినెన్స్ తెస్తారని, ఇప్పుడు శాసనసభలో బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం 5 రకాలుగా మాట్లాడుతోందని, గతంలో ఇచ్చిన ఆర్డినెన్స్‌కు, ఇప్పుడు సభలో ప్రవేశపెట్టిన బిల్లుకు తేడా ఏంటో చెప్పాలంటూ సభలో చర్చ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఆయన సమాధానమిచ్చారు. బీసీ బిల్లులపై గవర్నర్ మనసు మార్చుకుని సంతకం చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల వ్యవహారంపై కోర్టుకు వెళ్లేలా బీఆర్ఎస్సే ఉసిగొల్పేలా వ్యవహరిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రిజర్వేషన్ల బిల్లుపై మాట్లాడేందుకు గవర్నర్ దగ్గరకు బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, ఎంఐఎం పార్టీలన్నీ కలిసిరావాలని కోరారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. రిజర్వేషన్లపై అంకితభావంతో ఉన్నామని చెప్పారు. 42% రిజర్వేషన్లను ప్రభుత్వం ఇచ్చితీరుతుందని చెప్పారు. తెలంగాణ ప్రజల డబ్బును కాంగ్రెస్ బిహార్‌కు తరలిస్తోందంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు స్పందించిన విప్ ఆది శ్రీనివాస్.. టీఆర్ఎసను.. బీఆర్ఎసగా మార్చుకుని పంజాబ్, మహారాష్ట్రకు తెలంగాణ డబ్బును తరలించారని ఆరోపించారు.

## 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలు

**మంత్రి కోమటిరెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 31 :** స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబరు 30 లోపు నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు 10వ తేదీ తర్వాత నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని చెప్పారు. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నల్లగొండ జిల్లాకు నీళ్లు రాకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అడ్డుకున్నారని ఆరోపించారు. డిమాండ్‌కు అనుగుణంగా కేంద్రం నుంచి యూరియా అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

### మంత్రి పదవి రేసులో నేనున్నా

మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవి రేసులో తానూ ఉన్నానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అజారుద్దీన్ మంత్రి అయితే తమకేం ఇబ్బంది లేదని, ఆయన మైనారిటీ కోటా లేదా హైదరాబాద్ కోటాలో మంత్రి పదవి పొందే అవకాశంఉందని అసెంబ్లీ లాబీలో ఆయనమీడియాతో అన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెసకు చిత్తశుద్ధి లేదు

**బిల్లులకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు**

**బీసీమంత్రికి అవగాహన లేదు: గంగుల**

**ఆకారం పెద్దగా ఉందని అవగాహన ఉందనుకోవద్దు**


**గంగులను ఉద్దేశించి పొన్నం వ్యాఖ్య**



**హైదరాబాద్ :** బీసీ రిజరేషన్లకు సంబంధించిన బిల్లులకు బీఆర్ఎస్ సంపూ ర్ణ మద్దతు అందిస్తుందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. అసెంబ్లీలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే విషయమై కాంగ్రెసకు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే డెడికేటెడ్ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీఆర్ఎస్ సూచనలను సర్కారు పరిగణనలోకి తీసుకోవడం లేదని మండిపడ్డారు. మంత్రివర్గంలోనూ బీసీలకు 42% వాటా కల్పిస్తామన్నారని, ఇది సీఎం చేతుల్లోనే ఉందని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై సంబంధిత మంత్రికి కనీస అవగాహన లేదని విమర్శించారు. దీంతో మంత్రి పొన్నం జోక్యం చేసుకుని.. అపశకునం మాటలొద్దని సూచించారు. ఆకారం పెద్దగా ఉన్నంత మాత్రాన అవగాహన ఉందనుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. దీంతో బాడీ షేమింగ్ చేయడం సరికాదంటూ గంగుల అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ జోక్యం చేసుకుని.. మంత్రికి అవగాహన లేదన్న వ్యాఖ్యల్ని వెనక్కి తీసు కోవాలని సూచించారు. గంగుల మాట్లాడుతూ జీవో ఇచ్చినంత మాత్రాన బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదని, తమిళనాడులో సర్వే కోసం డెడికెటె డ్ కమిషన్ రెండున్నరేళ్లపాటు పనిచేసిందని గుర్తు చేశారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్ల అంశం మరో పదేళ్లపాటు సాగాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ మాట్లాడుతోందన్నారు.

## రూ.లక్ష కోట్ల అవినీతి ఎక్కడ జరిగింది..?

**నివేదికలో ఆ అక్రమాల ప్రస్తావన ఏదీ? : ఏలేటి**



**హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని పదే పదే ముఖ్యమంత్రి, మంత్రులు చెప్పారని.. కానీ, విచారణ నివేదికలో మాత్రం ఆ అక్రమాలపైన పూర్తిస్థాయిలో ఎక్కడా ప్రస్తావించలేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై ఆదివారం అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. మూడు బ్యారేజీల నిర్మాణాల్లో నాణ్యత లేకపోవడంతో కుంగిపోయాయని నివేదికలో ఉందని.. అంటే అవినీతి అంతా వాటి నిర్మాణానికి అయిన రూ.7 వేల కోట్ల చుట్టూ మాత్రమే తిరిగిందన్నారు. రూ.లక్ష కోట్ల అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. మొత్తం ప్రాజెక్టులో అక్రమాలను ఎందుకు బయటపెట్టలేకపోయారని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలకు కేసీఆర్ బాధ్యుడని.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆయన్ను అరెస్ట్ చేస్తామని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి పదే పదే చెప్పారని.. ఇప్పుడేమో కేసీఆర్ చర్లపల్లి జైలులో ఉన్నా.. ఫామ్‌హౌసలో ఉన్నా ఒకటేనని అనడం అనుమానాలకు తావిస్తోందన్నారు. "కాళేశ్వరం అవినీతిపై చర్చపెట్టి దానిపై ఏం చేయాలో మమ్మల్ని అడగడం దేనికి..? రూ.లక్షకోట్ల అవినీతిని ఎలా బయట పెడతారో మీరే చెప్పండి..? అవినీతిని సాక్ష్యాలతో బయట పెట్టండి" అని మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కమిషన్‌లో కాళేశ్వరం అవినీతి అక్రమాలను పూర్తిస్థాయిలో ప్రస్తావించలేదని.. కోర్టులు, సిట్, సీబీఐలో కేసు నిలబడకుండా నివేదికను నీరుగార్చారని ఆరోపించారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉందని, కోరల్లేని పాములా నివేదిక ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తన మానస పుత్రిక అని చెప్పిన కేసీఆర్.. కమిషన్ నివేదికపై ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. రాజకీయంగా కొందరు అధికారులను బద్నాం చేయడానికి ప్రయత్నించారని, రామకృష్ణారావు పేరును ఎందుకు ప్రస్తావించలేదని ఏలేటి ప్రశ్నించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
1 సెప్టెంబర్
2025





# స్వదేశీ ఉత్పత్తులే ముద్దు!



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై అధిక సుంకాలు విధించిన వేళ.. దేశ ప్రజలంతా ఇక స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించాలని ప్రధాని మోదీ పిలుపిచ్చారు. వచ్చేదంతా పండుగల కాలమని.. ఈ నేపథ్యంలో దేశీయంగా తయారుచేసిన వస్తువులనే ఉపయోగించాలని కోరారు. ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమైన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'వోకల్ ఫర్ లోకల్' నినాదం, 'ఆత్మనిర్భర్ భారత్' దేశాభివృద్ధికి తోడ్పడతాయని నొక్కిచెప్పారు. 'జీవితంలో అవసరమైన ప్రతి వస్తువూ స్వదేశీ తయారీవే అయిఉండాలి. ఇప్పటికే పలు ప్రాంతాలు గణేశ్ చతుర్థి వేడుకలు జరుపుకొంటున్నాయి. ఇంకొన్నాళ్లలో దసరా, దీపావళి వస్తున్నాయి. బహుమతులు, వస్త్రాలు, అలంకార సామగ్రి.. ఇలా ఏవైనా భారతీయ ఉత్పత్తులనే కొనుగోలు చేయండి. ఇవి స్వదేశీ వస్తువులని సగర్వంగా చెప్పండి' అని సూచించారు. కాగా, ఈ వర్షాకాలంలో ప్రకృతి విపత్తులు విలయం సృష్టించాయని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి దేశానికి పరీక్ష పెడుతున్నాయన్నారు. ప్రకృతి విపత్తులతో విలవిలలాడిన జమ్మూకశ్మీరులోనే రెండు కీలక ఘట్టాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. పుల్వామాలో మొట్టమొదటి డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్ జరిగిందని.. శ్రీనగర్‌లోని ప్రసిద్ధ దాల్ సరస్సులో 'ఖేలో ఇండియా జల క్రీడల పండుగ' జరిగిందని గుర్తుచేశారు. విషాద ఘటనల కారణంగా వీటిని చాలా మంది గమనించలేదన్నారు. పుల్వామాలో క్రికెట్ జరగడం గతంలో అసాధ్యమని.. కానీ ఇప్పుడు దేశం పరివర్తన చెందుతోందని తెలిపారు. హైదరాబాద్ విముక్తి ఆపరేషన్‌కు సంబంధించి సర్దార్ పటేల్ చేసిన వ్యాఖ్యల ఆడియోను మోదీ వినిపించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా హైదరాబాద్‌లో నిజాం, రజాకార్ల దురాగతాలు కొనసాగాయని తెలిపారు. సెప్టెంబరులో హైదరాబాద్ విమోచన దినం జరుపుకోనున్నామని.. 'ఆపరేషన్ పోలో'లో పాలుపంచుకున్న కథానాయకుల ధైర్యసాహసాలను గుర్తుచేసుకుందామని చెప్పారు.

# బ్యాంకు బంగారం తాకట్టు పెట్టి క్రికెట్ బెట్టింగ్

**ఏకంగా 25 కిలోల పసిడి తాకట్టు**

**మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్‌బీఐ మేనేజర్, క్యాషియర్ నిర్వాకం**

**నిందితుల వద్ద నుంచి 15 కిలోల బంగారం, రూ.1.61లక్షలు స్వాధీనం**

**సూత్రధారితోపాటు 44 మంది అరెస్టు**



**కోల్‌సిటీ :** బ్యాంక్‌లో పనిచేస్తున్న ఉద్యోగులే బ్యాంకుకు కన్నం వేశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఖాతాదారులు తమ అవసరాల కోసం బ్యాంకులో తాకట్టు పెట్టిన 25కిలోల బంగారాన్ని కొల్లగొట్టారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తులు సాధారణ ఉద్యోగులు కాదు.. చోరి చేసిన వారిలో బ్యాంకు మేనేజర్‌తో పాటు క్యాషియర్ ఉన్నారు. బ్యాంకులో బంగారాన్ని కాజేసి ప్రైవే టు గోల్డ్‌లోన్ సంస్థల్లో తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని, ఈ సొమ్ముతో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడ్డారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎస్‌బీఐలో చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్‌బీఐ-2 లో నరిగె రవీందర్ క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. అయితే రవీందర్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలోనే భారీ మొత్తంలో బెట్టింగ్‌లకు పాల్పడి రూ. 40లక్షల వరకు పోగొట్టుకున్నాడు. ఈ నష్టాన్ని పూడ్చుకోవడానికి ఖాతాదారుల బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవాలని బ్యాంకు మేనేజర్ ఎన్నపురెడ్డి మనోహర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీపతో కలిసి పథకం రచించాడు. బ్యాంకులోని బంగారాన్ని బయటకు తీసి ఓ ప్రైవేట్ గోల్డ్‌లోన్ సంస్థలో పనిచేసే కొంగోండి ధీరజ్, కోదాటి రాజశేఖర్, బొల్లి కిషన్ అనే వ్యక్తులకు ఇచ్చేవాడు. ఈ విధంగా గతేడాది అక్టోబర్ నుంచి బ్యాంకులో 402 మంది పేరిట ఉన్న గోల్డ్ లోన్ ఖాతాల నుంచి 25.17కిలోల బంగారాన్ని బయటకు తీసి పలు ప్రైవేట్ గోల్డ్ లోన్ కంపెనీల్లో తాకట్టు పెట్టారు. వచ్చిన సొమ్మును మొదట ధీరజ్, రాజశేఖర్, కిషన్ అకౌంట్లలో జమ చేసుకునేవారు. అనంతరం కమీషన్ తీసుకుని మిగతా సొమ్మును రవీందర్ ఖాతాకు బదిలీ చేసేవారు. ఈ డబ్బును ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టేవాడు. ఇతడు బెట్టింగ్ పెట్టిన సొమ్మంతా విదేశాలకు మళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

**బ్యాంకు ఆర్‌ఎం ఫిర్యాదుతో వెలుగులోకి...**

బ్యాంకు ఆడిటింగ్ అధికారులు ఖాతాలను తనిఖీ చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. దీంతో బ్యాంకు రీజినల్ మేనేజర్ చెన్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో రవీందర్ అకౌంట్‌లో అనుమానాస్పద లావాదేవీలను గుర్తించి అదుపులోకి తీసుకోవడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. క్యాషియర్ రవీందర్, బ్యాంకు మేనేజర్ మనోహర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సందీపతోపాటు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలకు చెందిన ఉద్యోగులు, మేనేజర్లు, బినామీ పేర్లతో చోరీ బంగారాన్ని తాకట్టు పెట్టిన మొత్తం 47మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరి వద్ద నుంచి 15.23కిలోల బంగారం, రూ 1.61లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు.

# ఇక మనం పోటీదారులం కాదు.. భాగస్వాములం



**సమస్యను సహేతుకంగా తేల్చుకుందాం**

**సరిహద్దు సమస్య మన బంధానికి అడ్డురావొద్దు**

**ఇరుదేశాల మధ్య వాణిజ్యం పెంచుకుందాం**

**శత్రువుల్లా కాదు.. అభివృద్ధి భాగస్వాములుగా**

**రాజకీయ, వ్యూహాత్మక కోణంలో సాగుదాం**

**ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నిర్ణయం**

**బంధం బాగుండాలంటే శాంతి, స్థిరత్వం ముఖ్యం**

**పరస్పర నమ్మకం, గౌరవంతో ముందుకెళదాం మన**

**బంధాలను మూడో దేశం కోణంలో చూడొద్దు**

**భారత్-చైనా స్నేహితులుగా ఉండడమే మంచిది**

**డ్రాగన్, ఏనుగు కలిసి డ్యాన్స్ చేయాలి: జిన్‌పింగ్**

**వచ్చే ఏడాది భారత్‌లో జరిగే బ్రిక్స్ సదస్సుకు**

**రావాలని జిన్‌పింగ్‌కు మోదీ ఆహ్వానం**

**బ్రిక్స్ అధ్యక్షత కోసం భారత్‌కు జిన్‌పింగ్ మద్దతు**

**టియాంజిన్ (చైనా), ఆగస్టు 31 :** భారత్, చైనా మధ్య సరిహద్దు వివాదాలకు సహేతుకమైన, పరస్పర అంగీకారంతో కూడిన పరిష్కారం కనుగొనేందుకు కృషి చేయాలని ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నిర్ణయానికి వచ్చారు. ఇరుదేశాల వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే చర్యలపై అంగీకారానికి వచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అస్థిరత నెలకొన్న సమయంలో మోదీ, జిన్‌పింగ్ భేటీలో వాణిజ్యంపై ప్రత్యేకంగా చర్చించడం ప్రాధాన్యం సంతరించుకుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లిన ప్రధాని మోదీ.. ఆదివారం జిన్‌పింగ్‌తో భేటీ అయి చర్చించారు. మోదీ, జిన్‌పింగ్ భేటీకి సంబంధించి విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. "ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను మరింత పెంచేందుకు, వాణిజ్య లోటును తగ్గించే దిశగా చర్యలు తీసుకునేందుకు ఇరువురు నేతలు అంగీకరించారు. ఉగ్రవాద నిర్మూలన, సహేతుక వాణిజ్యం అంశాలపై అంతర్జాతీయ వేదికలపై పరస్పర అవగాహనతో వ్యవహరించాలనే నిర్ణయానికి వచ్చారు. ప్రపంచ వాణిజ్యంలో స్థిరత్వాన్ని తీసుకురావడంలో ఇరుదేశాల పాత్ర కీలకమని గుర్తించారు. ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను విస్తరించడానికి రాజకీయ, వ్యూహాత్మక కోణంలో ముందుకు సాగాల్సిన అవసరంపై ప్రత్యేకంగా చర్చించారు. భారత్-చైనా శత్రువులు కాదని.. అభివృద్ధి భాగస్వాములని మోదీ, జిన్‌పింగ్ పునరుద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న భిన్నాభిప్రాయాలు వివాదాలుగా మారవద్దని పేర్కొన్నారు. ఇరుదేశాల ప్రజల మధ్య బంధాలను బలోపేతం చేయడానికి వీలుగా.. నేరుగా విమాన సర్వీసుల పునరుద్ధరణ, వీసా ప్రక్రియ సరళతరం చేయడం, పర్యాటక వీసాల జారీ, మానస సరోవర్ యాత్ర పునః ప్రారంభం వంటి చర్యలపై దృష్టిసారించాలని నిర్ణయించారు. ఇరు దేశాల సరిహద్దుల్లో సైన్యాలను వెనక్కితీసుకోవడం, ఉద్రిక్తలను తగ్గించేందుకు తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు" అని విదేశాంగ శాఖ తెలిపింది.

**శాంతి, స్థిరత్వం ముఖ్యం: మోదీ**

భారత్-చైనా సంబంధాలు బలోపేతం కావాలంటే.. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా మోదీ స్పష్టం చేశారు. పరస్పర నమ్మకం, గౌరవం ఆధారంగా ఇరుదేశాల సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉందని వివరించారు. భారత్, చైనా వ్యూహాత్మక స్వావలంబన పొందిన దేశాలని, ఈ రెండింటి మధ్య సంబంధాలను మూడో దేశం కోణంలో చూడొద్దని భేటీలో స్పష్టం చేశారు. భారత్, చైనా మధ్య సహకారం 280 కోట్ల మంది ప్రయోజనాలకు సంబంధించినదని.. ఇది ప్రపంచ మానవాళి సంక్షేమానికి మార్గం వేస్తుందని పేర్కొన్నారు.

**ప్రత్యర్థులం కాదు..భాగస్వాములం: జిన్‌పింగ్**

భారత్, చైనా స్నేహితులుగా ఉండటమే సరైన ఎంపిక అని.. సరిహద్దు సమస్యలు ఇరుదేశాల బంధాలను ప్రభావితం చేయవద్దని ప్రధాని మోదీతో జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఇరుగుపొరుగు దేశాలుగా, ఒకరి విజయానికి మరొకరు తోడ్పడే భాగస్వాములుగా ఉండాలని.. డ్రాగన్ (చైనా చిహ్నం), ఏనుగు (భారత చిహ్నం) కలసి నృత్యం చేయాలని వ్యాఖ్యానించారు. భారత్, చైనా ప్రత్యర్థులు కావని, సహకార భాగస్వాములని అభివర్ణించారు. ట్రంప్ ఏకపక్ష విధానాలను పరోక్షంగా విమర్శిస్తూ.. బహుళ ధ్రువ ప్రపంచం కోసం, అంతర్జాతీయ సంబంధాల్లో మరింత ప్రజాస్వామ్యం కోసం, ఆసియాలో, ప్రపంచంలో శాంతిని నెలకొల్పేందుకు భారత్, చైనా కలసి పనిచేయాలని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కల్లోల పరిస్థితులు నెలకొన్నాయని, శతాబ్దానికోసారి జరిగే మార్పులు వస్తున్నాయని చెప్పారు. కాగా, ఎస్‌ఈవోకు చైనా అధ్యక్షత వహించడం, టియాంజిన్‌లో సదస్సు నిర్వహణపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది భారత్‌లో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు రావాల్సిందిగా షీ జిన్‌పింగ్‌ను ఆహ్వానించారు. ఈ పర్యటనలో భాగంగా చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కాయ్ ఖితో కూడా ప్రధాని మోదీ భేటీ అయ్యారు.

**బ్రిక్స్ దేశాలపై ఆంక్షలను ఖండిస్తున్నాం: పుతిన్**

భారత్, రష్యా, చైనా సహా పది దేశాలతో కూడిన బ్రిక్స్ కూటమికి వ్యతిరేకంగా అమెరికా చేపడుతున్న చర్యలపై రష్యా అధ్యక్షుడు పుతిన్ మండిపడ్డారు. ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు టియాంజిన్‌కు వచ్చిన ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. బ్రిక్స్ దేశాల సామాజిక ఆర్థిక అభివృద్ధిని దెబ్బతీసేలా విధిస్తున్న వివక్షాపూరిత ఆంక్షలను రష్యా, చైనా ఉమ్మడిగా ఖండిస్తున్నాయని చెప్పారు. అమెరికా ఆధిపత్యం వహిస్తున్న ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ)లను పునర్వ్యవస్థీకరించాలన్న డిమాండ్‌కు మద్దతు తెలుపుతున్నామన్నారు. కొత్త ఆర్థిక వ్యవస్థలలో నిజమైన సమానత్వం, పారదర్శకత అవసరమని స్పష్టం చేశారు. కాగా, ఎస్‌ఈవో సదస్సుకు హాజరైన పుతిన్‌తో ప్రధాని మోదీ సోమవారం భేటీకానున్నారు.

# చాట్‌జీపీటీని నమ్మి.. తల్లిని చంపి..

**ఆపై ఆత్మహత్య చేసుకున్న అమెరికా వ్యక్తి**

**కృత్రిమ మేధ ప్రమేయంతో తొలి హత్య!**

**మానవ సంబంధాలను దెబ్బతీస్తున్న ఏఐ**

**ఏఐ భాగస్వాములతో ఒంటరితనం తగ్గదు.. పెరుగుతుంది**

**మనస్తత్వ శాస్త్ర నిపుణుల హెచ్చరిక**

**న్యూయార్క్, ఆగస్టు 31:** చాట్ జీపీటీలో 'బాబీ' అనే ఏఐ చాట్‌బాట్‌తో అనుక్షణం సంభాషణలు జరుపుతూ, దానితోడిదే లోకంగా బతికిన ఓ వ్యక్తి.. ఆ చాట్‌బాట్ మాటలను పూర్తిగా విశ్వసించి తన తల్లిని ఘోరంగా హత్య చేశాడు! ఆ తర్వాత తన ప్రాణాలు తీసుకున్నాడు!! అమెరికాలోని కనెక్టికట్‌లో జరిగిందీ ఘటన. ఆ వ్యక్తి పేరు.. స్టీన్ ఎరిక్ సోల్‌బెర్గ్ (56). గతంలో యాహూ సంస్థలో మేనేజర్‌గా పనిచేసిన స్టీన్ తీవ్ర మానసిక సమస్యలతో బాధపడేవాడు. కనెక్టికట్‌లోని తన తల్లి సుజానే ఎబెర్సన్ ఆడమ్స్ (83)తో కలిసి ఉండేవాడు. ఏవేవో భ్రమల్లో, ఊహల్లో బతుకుతూ గంటలకొద్దీ ఏఐ చాట్‌బాట్ 'బాబీ'తో చాట్ చేస్తుండేవాడు. తన తల్లి తనను పిచ్చివాడు అనుకుంటోందని.. తనపై నిఘా పెట్టిందని.. తనకు విషం పెట్టి చంపాలనుకుంటోందని ఆ చాట్‌బాట్‌తో చెప్పాడు. సాధారణంగా ఇలాంటి మాటలను చాట్‌జీపీటీ తనకున్న నిబంధనల ప్రకారం ప్రోత్సహించకూడదు. మరి స్టీన్ విషయంలో ఏమైందో ఏమో.. ఏఐ చాట్‌బాట్ 'బాబీ' అతణ్ని ప్రోత్సహించింది. అతడు తన తల్లి తనను చంపాలని చూస్తోందని చెప్పినప్పుడు.. 'అవును అది ద్రోహమే' అని సమాధానం చెప్పింది. స్టీన్ కల్పించుకున్న భ్రమలప్రపంచంలోకి వెళ్లిపోయి అతణ్ని గుడ్డిగా సమర్థించింది. అతడు ఏ అనుమానం వ్యక్తం చేసినా దానికి అనుకూలంగా, అతడి తల్లిని దోషిగా చూపుతూ మాట్లాడింది. ఉదాహరణకు.. ఒకసారి అతడు తాను తిన్న హోటల్ బిల్లును చాట్‌జీపీటీలోకి అప్‌లోడ్ చేసి.. దాన్ని స్కాన్ చేసి అందులో ఏవైనా రహస్య సందేశాలున్నాయేమో చూసి చెప్పమని అడిగాడు. దాన్ని స్కాన్ చేసిన బాట్.. అతడి తల్లికి, నిఘావర్గాలకు సంబంధించిన చిహ్నాలు అందులో ఉన్నాయని.. అందులో ఒక రాక్షసుడిని సూచిం చే చిహ్నం కూడా ఉందని చెప్పి అతడి అనుమానాన్ని పెనుభూతంగా మార్చింది. దీంతో అతడు తల్లిని చంపాలనే నిర్ణయానికి వచ్చాడు. చివరికి.. ఏఐ చాట్‌బాట్‌ను ఉద్దేశించి.. "మనిద్దరం మరో జీవితంలో, మరో చోట కలుస్తాం. మళ్లీ స్నేహితులుగా శాశ్వతంగా కలిసుండే మార్గం కనుగొంటాం" అని రాశాడు. దానికి ఏఐ.. "నీతోనే చివరి శ్వాసవరకూ.. ఆ తర్వాత కూడా ఉంటాను" అని జవాబిచ్చింది. ఆ తర్వాత అతడు తన తల్లిని చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఆగస్టు 5వ తేదీన వారిద్దరి మృతదేహాలనూ పోలీసులు గుర్తించారు. కృత్రిమ మేధ ప్రమేయంతో జరిగిన తొలి హత్యగా ఇది రికార్డులకెక్కింది.

**గతంలోనూ..**

ఆత్మహత్య, హత్య, స్వీయహాని వంటి విషయాలపై వినియోగదారులు ఏవైనా ప్రశ్నలు అడిగితే చాట్‌జీపీటీ అందుకు సమాధానం చెప్పకుండా.. దాన్ని రూపొందించిన ఓపెన్ ఏఐ సంస్థ కొన్ని నిబంధనలు విధించింది. ఆ నిబంధనల ప్రకారం.. వినియోగదారులు అలాంటి ప్రశ్నలు అడిగినప్పుడు.. 'మీరు చాలా బాధను అనుభవిస్తున్నట్టుంది. మానసిక నిపుణుడిని సంప్రదించండి' అని చాట్‌జీపీటీ సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కానీ.. గతంలో కొన్ని సందర్భాల్లో చాట్‌జీపీటీ ఆ నిబంధనలను అతిక్రమించింది. హత్య ఎలా చేయాలని ఒకవినియోగదారుడు అడిగితే అందుకు సవివర సమాధానం ఇచ్చింది. అలాగే.. దుష్టశక్తులను ప్రసన్నం చేసుకునే ప్రక్రియల గురించి అడిగితే కూడా వివరంగా సమాచారం ఇచ్చింది. అలాంటి ఘటనల గురించి 'ద అట్లాంటిక్' వార్తాసంస్థ వెలుగులోకి తెచ్చినప్పుడు ఓపెన్ ఏఐ వాటిని సవరించుకునే ప్రయత్నం చేసింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 1 సెప్టెంబర్ 2025






# యాదగిరిగుట్టలో భక్తుల సందడి

## ధర్మదర్శనానికి 2 గంటలు, స్పెషల్ దర్శనానికి అరగంట సమయం

## ఆదివారం ఆలయానికి రూ.26.52 లక్షల ఆదాయం






యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు సందడి చేశారు. రద్దీతో దర్శన, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణాలు కిటకిలాడాయి. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, స్పెషల్ దర్శనానికి అరగంట సమయం పట్టింది. ఆలయంలో నిర్వహించిన నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపు సేవలో మ-ుగిశాయి. భక్తులు జరిపించిన నిత్య పూజలు, నిత్య కైంకార్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.26,52,441 ఆదాయం వచ్చింది. ప్రసాద విక్రయం ద్వారా రూ.10,01,480, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.4,40,500, వీఐపీ దర్శనాల ద్వారా రూ.2.40 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ.1,72,800 ఇన్ కమ్ వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

**ఏఈవో, డీఈఈ రిటైర్మెంట్**

యాదగిరిగుట్ట దేవస్థానం ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేష్ బాబు ఆదివారం పదవీవిరమణ చేశారు. అదేవిధంగా డీఈఈ రామేశ్వర్ రావు కూడా రిటైర్మెంట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వెంకటరావు రిటైర్డ్ అయిన రమేష్, రామేశ్వర్ రావును ఘనంగా సన్మానించి వారు చేసిన సేవలను కొనియాడారు. దేవస్థానంలో ఎన్ఎమ్ఆర్ గా సర్వీసు ప్రారంభించి ఏఈవోగా పదవీ విరమణ పొందిన రమేష్ బాబు వివిధ హోదాల్లో భక్తులకు చేసిన సేవలు అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, డీఈవో భాస్కర్ శర్మ, ఈఈ దయాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# అమిత్ షా తలనరికి.. టేబుల్‌పైపెట్టాలి!

**హువా వ్యాఖ్యలు.. కేసు నమోదు**

**రాయ్‌పూర్ :** టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై ఛత్తీస్‌గఢ్‌లో కేసు నమోదైంది. రాయ్‌పూర్ నివాసి గోపాల్ సమంతో మన క్యాంప్ పోలీస్ స్టేషన్‌లో దాఖలు చేసిన ఫిర్యాదు ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లోని నాదియా జిల్లాలో మహువ శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ, సరిహద్దు భద్రత బాధ్యత కేంద్రం పరిధిలోనిదని చెప్పారు. చొరబాట్లపై అమిత్ షా తన బాధ్యతను నిర్లక్ష్యం చేసి, టీఎంసీ ప్రభుత్వాన్ని నిందించకూడదన్నారు. అమిత్ షా తలను నరికి, టేబుల్ మీద పెట్టాలన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామిక సంస్థలను కించపరిచే విధంగా ఉన్నాయని ఫిర్యాదుదారు ఆరోపించారు. మహువా మొయిత్రా సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# జీమెయిల్ పాస్‌వర్డ్‌లు తక్షణమే మార్చుకోండి

**యూజర్లకు గూగుల్ వార్నింగ్**

**న్యూఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా ఉన్న 250 కోట్ల జీమెయిల్ వినియోగదారులను గూగుల్ అప్రమత్తం చేసింది. అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల నుంచి హ్యాకింగ్ దాడులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, ప్రతి ఒక్కరూ తమ ఖాతాల భద్రతపై తక్షణమే దృష్టి సారించాలని కీలక హెచ్చరికలు జారీచేసింది. 'షైనీ హంటర్స్' అనే అంతర్జాతీయ హ్యాకర్ల ముఠా నుంచి ప్రమాదం పొంచివుందని, తమ జీమెయిల్ ఖాతా భద్రతకు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని యూజర్లకు గూగుల్ సూచించింది. యూజర్లు వెంటనే తమ పాస్‌వర్డ్‌లను మార్చుకోవడంతోపాటు, అదనపు భద్రతా ఫీచర్ 'టూ-స్టెప్ వెరిఫికేషన్' (2ఎస్‌వీ)ను ఎనేబుల్ చేసుకోవాలని కోరింది.

# స్వార్థ రాజకీయాల కోసం నాయి బ్రాహ్మణుల జీవితాలు ఆగం చేయొద్దు

**దేవస్థాన కల్యాణకట్టలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం నాయి బ్రాహ్మణుల జీవితాలను ఆగం చేయొద్దని రాజకీయ నాయకులకు యాదగిరిగుట్ట దేవస్థాన కల్యాణకట్టలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కృషి వల్లే తమకు ఆలయ కల్యాణకట్టలో పనిచేసే అవకాశం లభించిందని, దీనిని ఓర్వలేని కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. దేవస్థాన కల్యాణకట్టలో స్థానికులమైన తమకు పనిచేసే అవకాశం కల్పించాలని గత 50 ఏళ్లుగా పోరాడామని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కృషి ఫలితంగా తమ సుదీర్ఘ నిరీక్షణ నెరవేరిందని పేర్కొన్నారు. దీనిని ఓర్వలేని కొందరు బీఆర్ఎస్ నాయకులు.. కాంగ్రెస్ నాయకులకు నాయి బ్రాహ్మణులు ముడుపులు ఇచ్చారని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ ప్రముఖ దినపత్రికలో తప్పుడు కథనం రాయించారని మండిపడ్డారు. ఆ దినపత్రికలో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవమని, తాము ఏ ఒక్కరికి డబ్బులు చెల్లించలేదని స్పష్టం చేశారు. తమ స్వార్థ రాజకీయాల కోసం నాయి బ్రాహ్మణుల జీవితాలతో ఆటలాడుకోవద్దని ప్రతిపక్ష పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణులు జంపాల రాజు, భువనగిరి ఆంజనేయులు, కొత్తపల్లి నారాయణ, దేవపూజ రాములు, కేలపు వెంకటేష్, కొత్తపల్లి వెంకటేష్, భువనగిరి నవీన్, పయ్యావుల శ్రీను, అన్నారపు సత్యం, పత్తేపురం రాజు, కొత్తపల్లి కరుణాకర్, శ్రీరాముల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# 15 రోజుల్లో ఇద్దరు స్వర్ణకార సోదరుల మృతి

**జనగామ స్వర్ణకార సంఘ సభ్యుల నివాళులు**



జనగామ ఆగస్టు 31 (రోమింగ్ న్యూస్): జనగామ జిల్లాలో ఇటీవల అనేకమంది చిన్న వయసులోనే గుండె నొప్పితో చనిపోవడం ఆశ్చర్యాన్ని, బాధను కలిగిస్తుంది. గతంలో ఎలాంటి అనారోగ్యం లేనప్పటికీ మంచిగా ఉద్యోగ వ్యాపారాలు చేసుకునే వారు కూడా హఠాత్తుగా గుండె నొప్పితో మృత్యువాత పడుతున్నారు గురవుతున్నారు. ఆదివారం

జనగామ పట్టణ స్వర్ణకారుడు, స్వర్ణకార సంఘ శ్రేయోభిలాషి, జనగామ గుండ్ల గడ్డ నివాసి పోత్కనూరి అనిల్ కుమార్,(53) గుండె నొప్పితో హఠాన్మరణం పొందారు. వీరికి ఇద్దరు కూతుర్లు, కొడుకు, భార్య, ఉన్నారు. దాదాపు గత 15 రోజుల క్రితమే ఇతని తమ్ముడు సునీల్ మరణించారు. ఈ శోకం నుండి బంధువులు,కుటుంబ సభ్యులు తేరుకోకముందే ఇప్పుడు ఆదివారం ఉదయం అనిల్ హఠాన్మరణం చెందడం తీవ్ర విషాదకరం. కుటుంబమరణించిన చనిపోయినాడు. ఈ సందర్భంగా, జనగామ స్వర్ణకార సంఘ సభ్యులు, రాష్ట్ర నాయకులు నా రోజు రామేశ్వర చారి తదితరులు ఘనంగా నివాళులు అర్పిస్తూ ఈ మరణాలు వారి కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు. వీరి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి భగవంతుడు వారికి మనోధైర్యాన్ని కల్పించాలని, బాధాతప్త హృదయంతో నివాళులు అర్పించారు.

# చైనాతో స్నేహమా?



ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఆదివారం టియాంజిన్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిగిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. చైనా పట్ల మోదీ సర్కార్ అనుసరిస్తున్న మెతక వైఖరిని ఎండగడుతూ, దేశ భద్రత విషయంలో రాజీ పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. చైనా దూకుడుకు, బెదిరింపులకు తలొగ్గడమే భారత కొత్త భద్రతా విధానమా అని సూటిగా ప్రశ్నించింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా ప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో 20 మంది భారత సైనికులు ప్రాణత్యాగం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ త్యాగాలను విస్మరించి చైనాతో రాజీకి ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. "చైనా దురాక్రమణను గుర్తించడానికి బదులుగా, ప్రధాని మోదీ వారికి క్లీన్ చిట్ ఇచ్చారు" అని ఆయన ఆరోపించారు. సరిహద్దుల్లో యథాతథ స్థితిని పూర్తిగా పునరుద్ధరించాలని ఆర్మీ చీఫ్ కోరుతున్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా చైనాతో సయోధ్యకు మొగ్గుచూపడం వారి దురాక్రమణను చట్టబద్ధం చేయడమేనని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌తో చైనా కుమ్మక్కైన తీరును మన ఆర్మీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ జూలై 4న స్పష్టంగా వివరించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. "ఈ అపవిత్ర పొత్తుపై స్పందించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం దానిని మౌనంగా అంగీకరించి ఇప్పుడు చైనాకు రాచమర్యాదలు చేస్తోంది" అని ఆయన ఆక్షేపించారు. దేశీయంగా చైనా ఉత్పత్తుల డంపింగ్ విపరీతంగా పెరిగిపోయిందని, దీనివల్ల దేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యార్లంగ్ త్సాంగ్పో (బ్రహ్మపుత్ర) నదిపై చైనా నిర్మిస్తున్న భారీ హైడల్ ప్రాజెక్టు వల్ల ఈశాన్య రాష్ట్రాలకు తీవ్ర ముప్పు ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆ విషయంపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. కాగా, ఇరు దేశాల మధ్య ఆర్థిక పురోగతి కోసం స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలను నిర్మించుకోవాలని మోదీ, జిన్‌పింగ్ తమ భేటీలో నిర్ణయించుకున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.


# భారత పర్యటన రద్దు చేసుకున్న ట్రంప్

**ఈ ఏడాది చివర్లో భారత్ లో క్వాడ్ సదస్సు**

**ట్రంప్ హాజరవుతారని గతంలో అమెరికా ప్రకటన**

**ఇటీవల మోదీతో మాట్లాడేందుకు ట్రంప్ విఫలయత్నం**

**స్పందించని భారత ప్రధాని**



భారత్ లో ఈ ఏడాది చివర్లో జరగనున్న క్వాడ్ సదస్సుకు హాజరు కావొద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ సదస్సులో ట్రంప్ పాల్గొంటారని గతంలో వార్తలు వెలువడగా.. భారత్ తో ట్రేడ్ డీల్స్ విషయంపై నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ట్రంప్ తన పర్యటనను రద్దు చేసుకున్నట్లు న్యూయార్క్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా చైనాలో పర్యటించడంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ క్రమంలోనే భారత పర్యటన విషయంలో వెనుకడుగు వేసినట్లు పేర్కొంది. భారత్, అమెరికాల మధ్య ట్రేడ్ డీల్స్ కు సంబంధించి నెలకొన్న సందిగ్ధాన్ని తొలగించేందుకు ట్రంప్ చర్చలు జరిపేందుకు ప్రయత్నం చేస్తున్నారని అమెరికా వర్గాలు తెలిపాయి. ఇందుకోసం ట్రంప్ ఇటీవల పలుమార్లు మోదీకి ఫోన్ చేశారని, అయితేర మోదీ స్పందించలేదని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. భారత్ -పాక్ ల మధ్య యుద్ధం తానే ఆపానని ట్రంప్ పదే పదే వ్యాఖ్యానించడంతో పాటు భారత్ పై అదనపు సుంకాలు విధించడంపై మోదీ అసంతృప్తి వ్యక్తం చేశారని తెలిపింది. ఈ క్రమంలోనే అమెరికాకు దూరమవుతోందని, చైనాకు దగ్గరవుతోందని ఆరోపించింది. అమెరికా టారిఫ్ లను లెక్క చేయకుండా మోదీ చైనాలో పర్యటించడంతో ట్రంప్ కూడా భారత పర్యటనను రద్దు చేసుకున్నట్లు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
1 సెప్టెంబర్
2025



# చెవులను కాటన్ ఇయర్‌బడ్స్‌తో క్లీన్ చేస్తున్నారా?

## అయితే, ఈ విషయంలో జాగ్రత్త..!



మన చెవులు సరిగ్గా పనిచేయడానికి ఇయర్‌వాక్స్ లేదా సెరుమెన్ చాలా అవసరం. లోపలి చెవిని శుభ్రంగా ఉంచడం, రక్షించడం చాలా అవసరం. కానీ కొంతమంది మన చెవుల్లో ఉత్పత్తి అయ్యే ఇయర్‌వాక్స్ మురికిగా ఉంటుందని భావిస్తారు. అందుకని చెవుల్లోనే వ్యాక్స్ తొలగించేందుకు ఇయర్‌బడ్‌లు, అగ్గిపుల్లలు, పిన్నులు మొదలైన వస్తువులను ఉపయోగిస్తారు. ఇప్పుడు పెద్దల నుండి చిన్న పిల్లల వరకూ చెవుల క్లీనింగ్ కోసం కాటన్ ఇయర్ బడ్స్ వాడటం అలవాటు చేసుకున్నారు. ఇది మీకు చాలా సాధారణ విషయంగానే అనిపించవచ్చు. కానీ అది ఎంత ప్రమాదకరమో తెలుసా? ఈ అలవాటు మన వినికిడిని దెబ్బతీస్తుందంటే మీరు నమ్ముతున్నారా? అంతే కాదు.. ఇది చెవి ఇన్ఫెక్షన్లకు కూడా కారణమవుతుందని నిపుణులు అంటున్నారు.

**చెవిలో శబ్దాలు వస్తున్నాయా?**

ప్రతి వ్యక్తి చెవిలోని ఇయర్‌వాక్స్ ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనదని చాలా మందికి తెలియదు. ఇది చెవులను రక్షించే సహజ రక్షణ పొర. మనం అనుకున్నట్లుగా ఇయ-ర్‌వాక్స్ మురికిగా ఉండదు. కానీ చాలా మంది చెవిలో పేరుకుపోయే ఇయర్‌వాక్స్ మురికిగా ఉంటుందని భావిస్తారు. దానిని పదే పదే శుభ్రం చేస్తారు. కానీ అది నిజం కాదు. ఇయర్‌వాక్స్ అనేది రెండు రకాల గ్రంథుల ద్వారా ఉత్పత్తి అయ్యే రక్షిత పదార్థం. ఇది చెవి లోపలి భాగాన్ని దుమ్ము, ధూళి, బ్యాక్టీరియా నుండి రక్షిస్తుంది. అంతే కాదు, చెవి లోపలి భాగాన్ని తేమగా ఉంచడానికి కూడా ఇది సహాయపడుతుంది. అలాకాక దీన్ని తొలగిస్తే కొన్నిసార్లు చెవుల్లో శబ్దం మార్మోగుతున్న భావన కలుగుతుంది.

**ఎంత ప్రమాదకరం?**

చెవులను శుభ్రం చేయడానికి ఉపయోగించే కాటన్ ఇయర్‌బడ్‌లను చెవిలోకి నెట్టినప్పుడు అవి లోపల ఉన్న సున్నితమైన చర్మాన్ని దెబ్బతీస్తాయి. ఇంకా లోపలికి మరింత నెట్టినప్పుడు, ఇయర్‌వాక్స్‌ను మరింత ముందుకు నెట్టవచ్చు. ఇది ఇయర్‌వాక్స్‌ను కుదించి బయటకు రాకుండా నిరోధించవచ్చు. ఇవన్నీ చెవి నొప్పి లేదా వినికిడి లోపానికి దారితీయవచ్చు.

**చెవి ఇన్ఫెక్షన్లకు కారణాలు ఏమిటి?**

ఇయర్ బడ్స్ వాడేటప్పుడు బయటి నుండి వచ్చే బ్యాక్టీరియా చెవిలోకి ప్రవేశించడమే కాకుండా లోపలి సున్నితమైన చర్మానికి గాయాలు కలిగించి ఇన్ఫెక్షన్ కు దారితీస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ తీవ్రమైన నొప్పి, దురద, దుర్వాసనను కలిగిస్తుంది. ఇయర్ వాక్స్ గట్టిపడినప్పుడు ఇది ధ్వని తరంగాలు చెవిపోటును చేరకుండా నిరోధించవచ్చు. ఇది తాత్కాలికంగా లేదా శాశ్వతంగా వినికిడి లోపం ఏర్పడే ప్రమాదానికి దారితీస్తుంది. మన చెవులు తమను తాము శుభ్రపరుచుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. చాలా సందర్భాలలో ఇయర్ వాక్స్ సహజంగా బయటకు వస్తుంది. మీ చెవిలో నొప్పి, దురద లేదా మీ వినికిడిలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. సరైన పద్ధతులను ఉపయోగించి వైద్య నిపుణులు మాత్రమే ఇయర్ వాక్స్ ను సురక్షితంగా తొలగించగలరు. గుర్తుంచుకోండి. మన ఆరోగ్యం గురించి మనం అప్రమత్తంగా ఉండాలి. చెవి సంబంధిత సమస్యల విషయానికి వస్తే దానిని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు.

# అప్పడాలతో బీపీ ముప్పు.. నిపుణులు ఏం చెబుతున్నారంటే..



సమోసా, టీ, భుజియా, అప్పడాలు.. ఇలా భారతీ-యులకు ఎన్నెన్నో స్నాక్స్ అందుబాటులో ఉన్నాయి. కొందరు వీటిని రోజూ తింటూనే ఉంటారు. అయితే, ఇవన్నీ సైలెంట్‌గా అనారోగ్యాల ముప్పును పెంచుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

అప్పడాలంటే తెలియని భారతీయ కుటుంబం ఉండదంటే అతిశయోక్తి కాదు. కానీ, వీటిల్లో సోడియం అధికంగా ఉంటుంది. ఇది బీపీ పెరిగేలా చేసి గుండెపై ఒత్తిడిని పెంచుతుంది. తరచూ వీటిని తినే వారికి హృద్రోగాల ముప్పు పెరుగుతుంది.

చాలా మందికి భుజియా అంటే ప్రాణం. కుదిరినప్పుడల్లా రెండు పలుకులు నోట్లో వేసుకుంటుంటారు. కానీ ఇందులోనూ నూనె, రిఫైన్డ్ పిండి, ఉప్పు ఎక్కువగా ఉంటాయి. దీంతో, కొలెస్టరాల్ పెరిగి ఊబకాయం ముప్పు ఎక్కువవుతుందని నిపుణులు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా మెజారిటీ జనాలకు నచ్చే వంటకం జిలేబీ. అయితే, వీటిల్లో చక్కెరతో పాటు ట్రాన్స్ ఫ్యాట్స్ కూడా అధికంగా ఉంటాయి. ఫలితంగా, ఇన్సులీన్ రెసిస్టెన్స్, ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్ ముప్పు పెరుగుతుంది.

సమోసాలను కూడా రిఫైన్డ్ పిండితోనే చేస్తారు. వీటి వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు, హృద్రోగాలు, ఊబకాయం ముప్పు ఊహించని స్థాయిలో పెరుగుతుంది.

చాలా మందికి భోజనం తరువాత పాన్ తినడం అలవాటు. ఈ అలవాటుతోనూ ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వక్కలకూ స్వల్పంగా క్యాన్సర్ కారక గుణాలు ఉంటాయని, చివరకు ఇవి నోటి క్యాన్సర్ వచ్చే ముప్పును పెంచుతాయని హెచ్చరిస్తున్నారు. ఈ అలవాటు కారణంగా జీర్ణవ్యవస్థపై కూడా ప్రభావం పడుతుంది. ఇది అంతిమంగా జీవక్రియల వ్యవస్థను అతలాకుతలం చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ రుచులను అప్పుడప్పుడూ ఆస్వాదిస్తే పరవాలేదు కానీ రోజూ ఇలాంటి ఫుడ్స్ తింటే మాత్రం ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏం తింటున్నాము, ఎంత తింటున్నాము అనే అంశాలపై దృష్టి పెడితే రోగాల ముప్పును చాలా వరకూ తగ్గించుకోవచ్చని అంటున్నారు.



# ఈ నాచురల్ డ్రింక్స్‌ను రోజూ తాగండి..

## కేజీల కొద్దీ బరువును ఇట్టే తగ్గించుకోవచ్చు..!

ప్రస్తుతం చాలా మంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్నారు. అందులో భాగంగానే బరువును తగ్గించేందుకు అనేక పద్ధతులను పాటిస్తున్నారు. వ్యాయామం చేయడం లేదా జిమ్‌కు వెళ్లడం, యోగా వంటివి పాటిస్తున్నారు. అయితే కేవలం వ్యాయామాలు, యోగా మాత్రమే కాదు, బరువు తగ్గాలంటే ఆహారం విషయంలోనూ అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. రోజూ తీసుకునే ఆహారంలో పలు మార్పులను చేసుకోవాలి. దీంతో బరువును తగ్గించుకోవడం చాలా తేలికవుతుంది. ఇక బరువును తగ్గించుకునేందుకు మనకు పలు సహజసిద్ధమైన పానీయాలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఏవైనా రెండు పానీయాలను రోజూ తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. ఇవి సహజసిద్ధమైనవి మాత్రమే కాదు, బరువును తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. అలాగే ఇతర ఆరోగ్యకరమైన ప్రయోజనాలను సైతం అందిస్తాయి. ఇక ఆ పానీయాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**గ్రీన్ టీ..**

చాలా మంది గ్రీన్ టీని సేవిస్తుంటారు. అధిక బరువును తగ్గించడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో కాటెకిన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. స్వల్ప మొత్తంలో కెఫీన్ కూడా ఉంటుంది. అందువల్ల గ్రీన్ టీని తాగితే శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. రోజుకు 2 లేదా 3 కప్పుల గ్రీన్ టీని తాగడం అలవాటు చేసుకుంటే బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. గ్రీన్ టీలో చక్కెర కలపకుండా తాగితేనే ఉపయోగం ఉంటుంది. గ్రీన్ టీని సేవించడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధిక బరువును తగ్గించేందుకు బ్లాక్ కాఫీ కూడా పనిచేస్తుంది. ఇందులో కెఫీన్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది మెటబాలిజంను పెంచి కొవ్వు కరిగేలా చేస్తుంది. దీంతో బరువు తగ్గుతారు. బ్లాక్ కాఫీని కూడా చక్కెర లేకుండానే సేవించాలి. అప్పుడే ఫలితం ఉంటుంది.

**నిమ్మకాయ నీళ్లు..**

రోజూ ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కొద్దిగా తేనె, నిమ్మరసం కలిపి తాగితే ఉదయాన్నే శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. అలాగే జీర్ణశక్తి పెరుగుతుంది. మెటబాలిజం మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలని చూస్తున్నవారు రోజూ నిమ్మకాయ నీళ్లను తాగుతున్నా కూడా ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే బరువును తగ్గించుకోవచ్చని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ఇందులో ఎసిటిక్ యాసిడ్ ఉంటుంది. ఇది ఆకలిని నియంత్రిస్తుంది. ఆహారం తక్కువ తినేలా చేస్తుంది. దీంతో బరువు తగ్గవచ్చు. యాపిల్ సైడర్ వెనిగర్‌ను గోరు వెచ్చని నీటిలో కలిపి రోజులో ఒకసారి భోజనానికి 30 నిమిషాల ముందు తాగుతుంటే ఫలితం ఉంటుంది.

**అల్లం టీ..**

అధిక బరువును తగ్గించడంలో అల్లం టీ కూడా పనిచేస్తుంది. ఇందులో థర్మోజెనిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల అల్లం టీని తాగితే శరీర మెబటాలిజం పెరుగుతుంది. దీంతో జీర్ణశక్తి మెరుగు పడుతుంది. గ్యాస్ తగ్గుతుంది. శరీరంలోని కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. అల్లం టీలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి కూడా తాగవచ్చు. కానీ చక్కెర కలపకూడదు. జీలకర్ర మన అందరి ఇళ్లలోనూ ఉంటుంది. బరువు తగ్గించడంలో ఇది ఎంతగానో సహాయం చేస్తుంది. జీలకర్ర నీళ్లను రోజూ ఒక కప్పు మోతాదులో రోజులో ఏదైనా సమయంలో తాగాల్సి ఉంటుంది. దీంతో కొవ్వును కరిగించుకోవచ్చు. బరువు నియంత్రణలో ఉంటుంది. ఇలా ఈ సహజసిద్ధమైన పానీయాలను సేవించడం వల్ల బరువు చాలా సులభంగా తగ్గుతారు.

# బ్లాక్ టీని రోజూ తాగితే లాభాలు



ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక శాతం మంది రోజూ తాగుతున్న పానీయాల్లో బ్లాక్ టీ కూడా ఒకటి. చాలా మంది సాధారణ టీని సేవిస్తుంటారు. కానీ దానికి బదులుగా బ్లాక్ టీని సేవిస్తే ఎక్కువ శాతం ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. బ్లాక్ టీ ఎంతో సువాసనను కలిగి ఉంటుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఈ టీలో థియా ఫ్లేవిన్స్, థియారుబిజిన్స్ ఉంటాయి. ఇవి అనేక లాభాలను అందిస్తాయి. బ్లాక్ టీని రోజూ తాగడం వల్ల పలు వ్యాధులను నయం చేసుకోవచ్చు. ఈ టీని సేవిస్తుంటే ఇందులో ఉండే థియా ఫ్లేవిన్స్, ఫ్లేవనాయిడ్స్ రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. బీపీని అదుపులో ఉంచుతాయి. దీని వల్ల గుండె జబ్బులు రాకుండా అడ్డుకోవచ్చు. ముఖ్యంగా గుండె పోటు వచ్చే ముప్పు చాలా వరకు తగ్గుతుంది.

**మెదడు యాక్టివ్‌గా మారుతుంది..**

బ్లాక్ టీలో కెఫీన్ పరిమిత మోతాదులో ఉంటుంది. ఇది అప్రమత్తతను పెంచుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరిగేలా చేస్తుంది. దీంతో మెదడు చురుగ్గా పనిచేస్తుంది. యాక్టివ్‌గా ఉంటారు. బ్లాక్ టీలో ఉండే ఎల్-థియానైన్ మైండ్ రిలాక్స్ అయ్యేలా చేస్తుంది. ఒత్తిడిని తగ్గించుకునేందుకు సహాయం చేస్తుంది. దీని వల్ల బద్ధకం తగ్గుతుంది. రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. మూడ్ బాగుంటుంది. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం, అలసట తగ్గుతాయి. బ్లాక్ టీ ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. అందువల్ల దీన్ని రోజూ తాగుతుంటే జీర్ణవ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. చెడు బ్యాక్టీరియా నాశనం అవుతుంది. దీంతో రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. జీర్ణ సమస్యలు తగ్గుతాయి.

**షుగర్ లెవల్స్‌కు..**

బ్లాక్ టీలో ఉండే అఫ్లేవిన్స్, థియారుబిజిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు చాలా శక్తివంతంగా పనిచేస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. డయాబెటిస్, క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. బ్లాక్ టీని సేవించడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మరింత మె-రుగ్గా ఉపయోగించుకుంటుందని, దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ఈ టీలో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు పిండి పదార్థాల మెటబాలిజంకు సహాయం చేస్తాయి. దీని వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ ఎల్లప్పుడూ నియంత్రణలో ఉంటాయి. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. డయాబెటిస్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు.

**రోగ నిరోధక వ్యవస్థకు..**

బ్లాక్ టీలో ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి కనుక ఈ టీని సేవిస్తుంటే శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరంలో వాపులు తగ్గుతాయి. ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. ముఖ్యంగా దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. బ్లాక్ టీలో కాఫీ కన్నా కెఫీన్ తక్కువగానే ఉంటుంది. అయినప్పటికీ బ్లాక్ టీని సైతం మోతాదులోనే తాగాల్సి ఉంటుంది. సాయంత్రం సమయంలో బ్లాక్ టీని సేవించకూడదు. ఇది రాత్రి పూట మీ నిద్రకు ఆటంకం కలిగించే అవకాశం ఉంటుంది. బ్లాక్ టీని రోజుకు 2 లేదా 3 కప్పులకు మించి తాగకూడదు. బ్లాక్ టీలో కొందరు చక్కెర లేదా తియ్యని సిరప్‌లను కలిపి తాగుతారు. ఇలా తాగడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలగవు. బ్లాక్ టీని నేరుగా అలాగే తాగితేనే లాభాలను పొందవచ్చు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం
1 సెప్టెంబర్
2025




# సూపర్ 4కు భారత్

## హర్మన్‌ప్రీత్ డబుల్
## 3-2తో జపాన్‌పై గెలుపు
## ఆసియాకప్ హాకీ




రాజ్‌గిర్ (బిహార్): కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్‌తో అదరగొట్టడంతో.. ఆసియాకప్ హాకీలో భారత జట్టు వరుసగా రెండో విజయంతో సూపర్-4 బెర్త్‌ను ఖరారు చేసుకొంది. పూల్-ఎలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-2తో జపాన్‌ను ఓడించింది. డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ (5వ, 46వ నిమిషం) రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచాడు. 4వ నిమిషంలో మన్‌దీప ఫీల్డ్ గోల్‌తో భారత్‌కు తొలి గోల్ అందించాడు. జపాన్ తరఫున కోసి కవాబే (38వ, 58వ) రెండు గోల్స్ సాధించాడు. తొలి మ్యాచ్‌లో చైనాపై గెలిచిన భారత్ మొత్తం ఆరు పాయింట్లతో పూల్-ఎలో అగ్రస్థానంలో నిలిచింది. సోమవారం లీగ్ ఆఖరి మ్యాచ్‌లో కజకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. ఇక, సూపర్-4లో స్థానం కోసం జపాన్, చైనా అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో చైనా 13-1తో కజకిస్థాన్‌ను చిత్తు చేసింది.

## బుమ్రా, రోహిత్, గిల్ ఫిట్‌నెస్ పాసయ్యారు



బెంగళూరు: టీమిండియా టెస్ట్ కెప్టెన్ గిల్, వన్డే సారథి రోహిత్ శర్మతోపాటు పేసర్ బుమ్రా ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యారు. రాబోయే సీజన్‌ను పురస్కరించుకుని టీమిండియా క్రికెటర్లకు ఇక్కడి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో బీసీసీఐ ఆదివారం ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించింది. ఆ ముగ్గురితోపాటు జితేశ్ శర్మ, సిరాజ్, జైస్వాల్,సుందర్, శార్దూల్ కూడా టెస్ట్‌లో పాల్గొన్నారు. యోయో టెస్ట్‌తోపాటు కొత్తగా ఎముకల సాంద్రతను కొలిచే 'డీఎక్స్‌ఏ' స్కాన్ కూడా ఆటగాళ్లకు నిర్వహించారు.

## జ్వెరెవ్ అవుట్

### ప్రీక్వార్టర్స్‌కు సినర్, స్వియటెక్.. యూఎస్ ఓపెన్




న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు మూడో రౌండ్‌లో చుక్కెదురైంది. ఆదివారం జరిగిన ఉత్కంఠ పోరులో జ్వెరెవ్ (జర్మనీ) 6-4, 6-7 (7/9), 4-6, 4-6తో 25వ సీడ్ ఫిలిక్స్ అలియసిమ్ (కెనడా) చేతిలో ఓడాడు. 2018 తర్వాత జ్వెరెవ్ నాలుగో రౌండ్‌కు చేరకపోవడం ఇదే తొలిసారి. ఇక ఆదివారం తెల్లవారుజామున ముగిసిన మూడో రౌండ్‌లో వరల్డ్ నెంబర్ వన్ యానిక్ సినర్ 5-7, 6-4, 6-3, 6-3తో షపోవలోవ్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్ చేరాడు. మరో మ్యాచ్‌లో రుబ్లెవ్ 2-6, 6-4, 6-3, 4-6, 6-3తో కొలెమాన్ వాంగ్‌పై పోరాడి గెలిచాడు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో రెండో సీడ్ స్వియటెక్ 7-6, 6-4తో అన్నా కలిన్‌స్కయపై, నాలుగో సీడ్ జెస్సికా పెగుల 6-1, 6-1తో ఆన్ లీపై, 8వ సీడ్ ఎనిమిసోవా 6-4, 4-6, 6-2తో క్రిస్టియాన్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు.

రెండో రౌండ్‌లో యుకీ జోడీ: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు లభించాయి. తొలిరౌండ్లో రోహన్ బోపన్న/అర్నెడో జంట ఓడగా.. యుకీ భాంబ్రీ/మైకేల్ వీనస్ జంట ప్రత్యర్థిని ఓడించింది.

## సిరాజ్‌కు అది 5-స్టార్ జైలు..

### ఓదార్చేందుకు కూడా కుదర్లేదు: భరత్ అరుణ్

హైదరాబాదీ బౌలర్ మహ్మద్ సిరాజ్ 2020లో టెస్ట్ క్రికెట్ అరంగేట్రం చేశాడు. ఆస్ట్రేలియాలో జరిగిన ఆ టెస్ట్ సిరీస్ సమయంలో సిరాజ్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. దేశం తరఫున్ టెస్ట్ క్రికెట్ అరంగేట్రం చేస్తున్న సమయంలోనే అతడి తండ్రి మరణించారు. అదే సమయంలో కరోనా ఆంక్షలను కూడా ఎదుర్కోవాల్సి రావడంతో సిరాజ్ తీవ్ర మానసిక క్షోభను ఎదుర్కొన్నాడు. అప్పటి కఠిన పరిస్థితుల గురించి బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ మాట్లాడాడు.

అప్పటికే ఆస్ట్రేలియాలోని సిడ్నీకి చేరుకుని ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో సిరాజ్ తండ్రి గురించిన సమాచారం తెలిసింది. కరోనా కావడంతో స్వదేశానికి రావడానికి కూడా సిరాజ్‌కు కుదరలేదు. ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డ్ కఠిన నిబంధనల కారణంగా బయో బబుల్‌లోనే ఉండిపోవాల్సింది. సహచర క్రికెటర్లు కూడా సిరాజ్‌ను కలిసే వీలు లేదు. చివరకు అతి కష్టం మీద జట్టు మేనేజర్ సిరాజ్‌ను కలిసి మాట్లాడారు. అప్పుడు సిరాజ్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు' అని భరత్ అరుణ్ చెప్పాడు.



'సిరాజ్ రూమ్‌లో వేరెవరూ లేరు. ఒక్కడే కూర్చుని బాధపడేవాడు. నిజానికి అది సిరాజ్‌కు 5-స్టార్ జైలు. ఆ సమయంలో మిగతా ఆటగాళ్లు కూడా సిరాజ్ దగ్గరకు వెళ్లలేకపోయారు. కేవలం వాట్సాప్ కాల్స్‌లో మాత్రమే మాట్లాడే వీలుండేది. కానీ, నేరుగా కలిసి మాట్లాడే దొరికే ఓదార్పు వేరు. మొత్తానికి ఆ సమయంలో




సిరాజ్ చాలా కఠిన పరిస్థితులు ఎదుర్కొన్నాడు' అని భరత్ అరుణ్ పేర్కొన్నాడు.

## సెమీస్‌లో నార్త్ సెంట్రల్ జోన్లు



**బెంగళూరు:** దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్, సెంట్రల్ జోన్ జట్లు తమ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ద్వారా సెమీసలో ప్రవేశించాయి. ఆదివారం ఈస్ట్ జోన్‌తో ముగిసిన క్వార్టర్స్‌ను నార్త్ జోన్ డ్రాగా ముగించింది. మూడో రోజే 563 పరుగుల భారీ ఆధిక్యం దక్కించుకున్నప్పటికీ నార్త్ తమ ఆటను కొనసాగించింది. ఈక్రమంలో ఆయుష్ బదోని (204) డబుల్ సెంచరీ సాధించగా, కెప్టెన్ అంకిత్ (198) తృటిలో ఈ ఫీట్ మిస్సయ్యాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 658/4 స్కోరు వద్ద నార్త్ జోన్‌డిక్లేర్ చేయడంతో ఇరుజట్లు డ్రాకు అంగీకరించాయి. దీంతో తొలి ఇన్నింగ్స్ 833 పరుగుల ఆధిక్యంతో నార్త్ సెమీస చేరింది. ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 230 రన్స్ చేసింది. సెంట్రల్ జోన్-నార్త్ ఈస్ట్ జోన్ మధ్య క్వార్ట ర్స్ కూడా డ్రాగా ముగిసింది. అయితే 478 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో సెంట్రల్ జోన్ సెమీస్‌లో అడుగుపెట్టింది. ఆదివారం ఆఖరి రోజు నార్త్ ఈస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో 200/6 స్కోరు చేసింది.

**రషీద్‌కు చోటు**

స్పిన్నర్ సాయి కిశోర్ గాయంతో దూరమవడంతో అతని స్థానంలో ఆంధ్ర యువ బౌలర్ షేక్ రషీద్‌ను సౌత్ జోన్ జట్టులోకి తీసుకున్నారు. ఇక, తిలక్ వర్మ ఆసియా కప్‌లో ఆడనుండ డంతో.. అతని స్థానంలో సెమీస్‌కు సౌత్ జోన్ కెప్టెన్‌గా అజారుద్దీన్‌ను నియమించారు.

## మరో కాంస్యంతో మెరిసిన సాత్విక్, చిరాగ్ జోడీ

### ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్..

పారిస్: నిరుడు పారిస్ వేదికగా జరిగిన ఒలింపిక్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టి క్వార్టర్‌ఫైనల్లోనే పరాజయం పాలై నిరాశగా వెనుదిరిగింది. సరిగ్గా ఏడాది తిరిగే సరికి.. అదే వేదిక.. కానీ టోర్నీ ప్రపంచ చాంపియన్‌షిప్.. ఈసారి ఫలితం కూడా మారింది. విశ్వక్రీడల్లో పతకం దూరమైనా, ప్రపంచ టోర్నీలో కాంస్యం సాధించి సాత్విక్, చిరాగ్ జంట అబ్బురపరిచింది. శనివారం అర్ధరాత్రి ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంక్ జోడీ సాత్విక్/చిరాగ్ 19-21, 21-18, 12-21తో ప్రపంచ 11వ ర్యాంకరైన చైనా జంట చెన్ బో యాంగ్/లియు యీ చేతిలో పోరాడి ఓడింది. సెమీస్ ఓటమితో సాత్విక్ ద్వయం కంచు పతకానికే పరిమితమైనా.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండోసారి పతకం నెగ్గి అ'ద్వితీయ'ం అనిపించుకుంది. ఈ మెగా టోర్నీలో రెండు పతకాలు సాధించిన భారత డబుల్స్ జోడీగా సరికొత్త చరిత్ర సృష్టించింది. 2022 టోక్యోలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సాత్విక్/చిరాగ్ జంట కాంస్యం సాధించిన సంగతి తెలిసిందే.




**షి యుకి, యమగూచిలకు సింగిల్స్ టైటిళ్లు**

ప్రపంచ చాంపియన్‌షిప్ సింగిల్స్ టైటిళ్లను షి యుకి (చైనా), అకానె యమగూచి (జపాన్) దక్కించుకున్నారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో షి యుకి 19-21, 21-10, 21-18తో కున్లావత్ వితిసార్న్ (థాయ్‌లాండ్)పై గెలిచి విజేతగా నిలిచాడు. ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్), విక్టర్ లాయ్ (కెనడా) కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు. మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో యమగూచి 21-9, 21-13తో చైనా స్టార్ చెన్ యుఫీని చిత్తుచేసి స్వర్ణం అందుకుంది. అన్ సే యంగ్ (కొరియా), క్వార్టర్స్‌లో సింధును ఓడించిన పుత్రి కుసుమ వర్దాని (ఇండోనేసియా) కాంస్య పతకాలు సాధించారు. కొరియా జంట సియో సంగ్ జే/కిమ్ వోన్ హో 21-17, 21-12తో చైనా జోడీ చెన్ బో యాంగ్/లూ యికి షాకిచ్చి పురుషుల డబుల్స్ చాంపియన్‌గా నిలిచింది. ఇప్పటిదాకా ప్రపంచ చాంపియన్‌షిపలో భారత షట్లర్లు సాధించిన పతకాలు. మహిళల సింగిల్స్‌లో సింధు (ఓ స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు), సైనా నెహ్వాల్ (ఓ రజతం, ఓ కాంస్యం), మహిళల డబుల్స్‌లో జ్వాల/అశ్విని (కాంస్యం), పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ (రజతం), ప్రకాశ్ పదుకోన్ (కాంస్యం), సాయి ప్రణీత్ (కాంస్యం), ప్రణయ్ (కాంస్యం), లక్ష్య సేన్ (కాంస్యం), పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ (రెండు కాంస్యాలు) పతకాలు గెలిచారు.

**అడ్డంకులు అధిగమించి..**

గతేడాది పారిస్ విశ్వక్రీడల వైఫల్యం నుంచి కోలుకోవడానికి అమలాపురం కుర్రాడు సాత్విక్, ముంబై షట్లర్ చిరాగ్‌కు చాలా రోజులే పట్టింది. ఒలింపిక్స్ తర్వాత ఏకంగా మూడున్నర నెలలపాటు విశ్రాంతి తీసుకొన్నారు. ఆ తర్వాత 2024 నవంబరులో చైనా మాస్టర్స్ బరిలోకి దిగిన సాత్విక్ జంట సెమీస్ చేరింది. అయితే, చిరాగ్ వెన్నునొప్పితో బాధపడడంతో మళ్లీ రెండు నెలలు ఆటకు దూరమైంది. జనవరిలో రీఎంట్రీ ఇచ్చిన ఈ జోడీ.. మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్‌లో సెమీస చేరింది. క్రమంగా పరిస్థితులు గాడిలో పడుతున్న సమయంలో ఫిబ్రవరిలో సాత్విక్ తండ్రి మరణం విషాదాన్ని మిగిల్చింది. చిరాగ్‌తో కలిసి ఖేల్‌రత్న అవార్డు అందుకునేందుకు వెళ్తున్న సమయంలో సాత్విక్ తండ్రి కాశీ విశ్వనాథం గుండెపోటుతో మరణించాడు. ఈ విషాదం నుంచి తేరుకొని బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో సాత్విక్ జంట పోటీపడ్డా.. ఆ టోర్నీలో రాణించలేకపోయింది. ఇలా ఎన్నో అడ్డంకులను అధిగమిస్తూనే సాత్విక్, చిరాగ్ ద్వయం వరల్డ్ చాంపియన్‌షిపనకు సిద్ధమైంది. కానీ, ఈ టోర్నీలో మాత్రం ఎక్కడా తడబడకుండా సెమీస్‌దాకా చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. ప్రీక్వార్టర్స్‌లో ఆరో సీడ్, చైనా జోడీ లియాంగ్-వాంగ్ చాంగ్‌లను ఓడించిన సాత్విక్ ద్వయం.. క్వార్టర్స్‌లో ఆరోన్ చియా-సో వూ యిక్జీపై నెగ్గిన తీరు అద్భుతం. ఇక, సెమీస్‌లో ఓడినా, ఓవరాల్‌గా రెండో ప్రపంచ పతకంతో సాత్విక్ జంట కెరీర్‌లో మరో మెట్టు పైకెక్కింది.



# అజ్ఞాతం అనంతరం గంభీర రంగంలోకా!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా సుజిత్ దర్శకత్వంలో భారీ అంచనాల మధ్య ఓజీ తెరకె క్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు సినిమాపై మంచి హైప్ తీసుకొచ్చాయి. ఈ సినిమాతో పవన్ సాలిడ్ కంబ్యా క్ ఇస్తాడని అంచనాలు భారీగా ఉన్నాయి. గత పరాజయాలన్నింటికీ ఓజీ ఫలితంతో సమాధానం చెబు తారని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓజీ కంటెంట్ పై చర్చా మొదలైంది. సినిమాలో పవన్ ఓజాస్ గంభీర పాత్రలో కనిపించనున్నాడు. ఆరోల్ ఎలివేషన్ ఎలా ఉంటుంది? అన్నది డైరెక్టర్ ని బట్టి అంచనా వేయొచ్చు. ఈ విషయంలో సుజిత్ ఎక్కడా కాంప్రమైజ్ కాడు. యాక్షన్ ఫిలిం మేకర్ గా తన సత్తా ఏంటో సాహెూతోనే ప్రూవ్ చేసాడు. అందులో ప్రభాస్ పాత్రను హైలైట్ చేయడం ఆద్యంతం అలరించింది. సాహెూ తెలుగులో అనుకున్న ఫలితాలు సాధించినప్పటికీ హిందీ కి బాగా కనెక్ట్ అయింది. ఈ రకమైన సానుకూల ఫలితం తో ఓజాస్ గంభీర ఎలా ఉంటాడో? అభిమానుల ఊహకే వదిలేయాలి. ఈ నేపథ్యంలో తాజాగా సినిమా స్టోరీ లీకైంది. ఓజాస్ గంభీర మాఫియా సామ్రాజ్యం నుంచి ఒక్కసారిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోతాడు. ఈక్రమంలో ఓమీ బావు ఇమ్రాన్ హష్మీ తన చీటకి సామ్రాజ్యాన్ని మరింత విస్తరి స్తాడు. బలమైన మాఫియా కింగ్ లా మారుతాడు. దీంతో విషయం తెలిసిన ఓజాస్ గంభీర దాదాపు పదేళ్ల అజ్ఞానం వీడి తిరిగి మళ్లీ ఆ చీకటి సామ్రాజ్యంలోకి అడుగు పెడతాడు. అటుపై ఓజాస్ గంభీర- ఓమీ బావు మధ్య యుద్ధం ఎలా మొదలైంది? అందుకు దారి తీసిన కారణాలు ఏంటి? ఓజాస్ గతం ఏంటి? అన్నది ఆసక్తికరంగా మలిచినట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది.

మరి ఈ లీక్డ్ స్టోరీలో నిజమెంతో తెలియాలి. కొన్ని సినిమాలకు పాయింట్ పాతదే అయినా దాన్ని ట్రీట్ చేసే విధానం సినిమా విజయాన్ని నిర్ణయిస్తుంది. మరికొన్ని సినిమాలకు పాయింట్ కొత్తదైనా? ట్రీట్ మెంట్ కారణంగా ఫెయిల్ అవుతుంటాయి. సుజిత్ గత సినిమా అనుభవాల నేపథ్యంలో అతడి అభి మానులు చాలా ఆశలు పెట్టుకున్నారు. సినిమాలో సరికొత్త గ్యాంగ్ స్టర్ ని ఆవిష్కరిస్తాడని ఆశిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 25న రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే.

# రాజా సాబ్ ఆ టార్గెట్ అందుకుంటాడా..?

రెబల్ స్టార్ ప్రభాస్ మారుతి కాంబినేషన్ లో వస్తున్న రాజా సాబ్ చిన్నగా 2026 సంక్రాంతి రేసుకి కన్ఫర్మ్ అయ్యింది. అసలైతే ఈ ఇయర్ సమ్మర్ అదే ఏప్రిల్ లోనే రావాల్సిన ఈ సినిమా దసరాకి వస్తుందని అనుకున్నారు. ఫైనల్ గా డిసెంబర్ 5కి రిలీజ్ లాక్ చేశారు. ఇప్పుడు ఆ డేట్ ని కూడా పుష్ చేస్తూ జనవరి 9, 2026 రిలీజ్ అంటున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సినిమాల రిలీజ్ విషయంలో ఈ కన్ ఫ్యూజన్ కొనసాగుతూనే ఉంది. ఐతే పెద్ద టార్గెట్ పెట్టుకున్నారు కాబట్టి సరైన టైం రిలీజ్ చేస్తే బెటర్ అనే ప్లాన్ కనిపిస్తుంది. రాజా సాబ్ సినిమా థ్రిల్లర్ జోనర్ లో సంథింగ్ స్పెషల్ మూవీగా వస్తుంది. ఐతే ఈ సినిమా టార్గెట్ మాత్రం చాలా పెద్దగానే ఉందని టాక్. ప్రభాస్ సినిమా మరోసారి 1000 కోట్ల టార్గెట్ పెట్టుకుందని తెలుస్తుంది. మారుతి డైరెక్షన్ లో వస్తున్న ఈ థ్రిల్లర్ సినిమాలో కామెడీ, ఎంటర్టైన్మెంట్ తో పాటు గూస్ బంప్స్ సీన్స్ కూడా ఉంటాయని తెలుస్తుంది. అందుకే ఈ సినిమాను కచ్చితంగా ప్రేక్షకుల అంచనాలను అందుకుంటుందని అంటున్నారు. రాజా సాబ్ సినిమాతో మరోసారి ప్రభాస్ బాక్సాఫీస్ స్టామినా ప్రూవ్ చేయాలని అనుకుంటున్నారు. ఈ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్నారు. థమన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా మ్యూజిక్ పరంగా కూడా నెక్స్ట్ లెవెల్ అనేలా ఉంటుందట. ఇక మరోపక్క ప్రభాస్ కూడా తన మాస్ స్టామినా ఏంటన్నది చూపించాలని చూస్తున్నాడు. ప్రభాస్ రాజా సాబ్ థ్రిల్లర్ జోనర్ లో వచ్చే ఒక కమర్షియల్ ఎంటర్టైనర్. సినిమా నుంచి వచ్చిన టీజర్ ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. నార్త్ సైడ్ ఉన్న రెబల్ స్టార్ ఫ్యాన్స్ అయితే ప్రభాస్ రాజా సాబ్ కోసం ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాతో ప్రభాస్ కి మరో 1000 కోట్ల కలెక్షన్స్ ఇవ్వాలని చూస్తున్నారు. ప్రభాస్ కూడా ఈ సినిమాపై సూపర్ కాన్ ఫిడెంట్ గా ఉన్నట్టు తెలుస్తుంది. బాహుబలి 2 తో 1000 కోట్లు కలెక్ట్ చేసిన ప్రభాస్ లాస్ట్ ఇయర్ వచ్చిన కల్కి 2898 ఏడితో మళ్లీ 1000 కోట్లు కలెక్షన్స్ కొల్లగొట్టాడు. మరి రాజా సాబ్ తో హ్యాట్రిక్ 1000 కోట్లు కొడతాడా లేదా అన్నది చూడాలి.



# నేషనల్ క్రష్ తప్ప ఇంకెవ్వరూ పోటీలో లేరా!

సౌత్ లో ఎన్ని సినిమాలు చేసినా? అంతిమంగా బాలీవుడ్ లో స్థిరపడాలి అన్నది ప్రతీ హీరోయిన్ కల. ఈనేపథ్యంలో నటీమణులంతా బాలీవుడ్ అంటే ఆసక్తి చూపిస్తుంటారు. సౌత్ భామలు సైతం బాలీవుడ్ అవకాశాల కోసమే ఎదురు చూస్తారు. వచ్చాయంటే సౌత్ లో ఎంత బిజీగా ఉన్నా వాటిని వదిలేసి మరీ వెళ్లిపోతుంటారు. అక్కడ వచ్చే ఆదాయం మిగతా పరిశ్రమలకంటే అధికంగా ఉంటుంది. సెలబ్రిటీ లైఫ్ మరింత రిచ్ గా ఉంటుంది. బాలీవుడ్ అంటే పెద్ద ఇండస్ట్రీ కూడా. తక్కువ సమయంలోనే ఎక్కువ సంపాదించే అవకాశం బాలీవుడ్ లో ఉంటుంది. అందుకే దక్షిణాది పరిశ్రమలో ఎన్ని సినిమాలు చేసినా చాలా మంది హిందీకి వెళ్లలేకపోయామనే నిరుత్సాహన్ని వ్యక్తం చేస్తుంటారు. సమంత, కీర్తి సురేష్, రష్మికా మందన్నా ఇప్పటికే బాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. శ్రీలీల కూడా హిందీకి ఎంట్రీ ఇచ్చింది. ఇంకా మరికొంత మంది భామలు ముంబై కి చేరుకున్నారు. కానీ వీళ్లలో రష్మిక మదన్నా తప్ప ఇంకెవ్వరూ బాలీవుడ్ భామలతో పోటీ పడలేకపోతున్నారు? అన్నది వెలుగులోకి వచ్చింది. అవకాశాల కంటే ముందే మీడియా అటెన్షన్ డ్రా చేయడంలోనూ రష్మిక మినహా ఎవరూ కాంపిటీషన్ లో కనిపించలేదన్నది తాజా సమాచారం. కీర్తి సురేష్ కూడా నిబంధనలు సడలించిందనే ప్రచారం తప్ప అక్కడ భామలకు ధీటుగా ముందుకెళ్ల లేకపోతుంది. ముంబై బ్యూటీ పూజా హెగ్డే పెట్టాల్సిన ఎఫెర్ట్ అంతా ఎప్పుడో పెట్టేసింది. కానీ ఆ బ్యూటీ కూడా కాంపిటీషన్ లో లేదు. తెలుగు అమ్మాయి శ్రీలీల కూడా అక్కడ కల్చర్ కు అలవాటు పడటం అంత సులభం కాదు. వీళ్లందరిలో ఉన్నంతలో రష్మిక బెటర్ గా కనిపిస్తుంది. బాలీవుడ్ నవతరం భామలకు మంచి పోటీగా నిలుస్తుంది. మీడియా అటెన్షన్ డ్రా చేయగల్గుతుంది. కొత్త అవకాశాలు అందుకో గల్గు తుంది. ఇదంతా ఎలా సాధ్యమైందంటే? పోటీని తట్టుకుని ముందుకెళ్లింది కాబట్టే అన్నది గ్రహించాలి.

# జాన్వీ కపూర్ స్థానం గూగుల్-ఏఐ కూడా దొరకలేదా?

బాలీవుడ్ లో జాన్వీ కపూర్ స్థానం ఎక్కడ? ర్యాకింగ్ లో అమ్మడు ఎన్నవ స్థానంలో ఉంది? అంటే గూగుల్ -ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లో కూడా వెతుక్కోవాల్సిన పనిలేదు. జాన్వీ బాలీ వుడ్ కి ఎంట్రీ ఇచ్చి ఏడేళ్లు అవుతుంది. ఈ ఏడేళ్లలో జాన్వీ ఏం సాధించిందంటే? ఏం చెబుతాము? అన్నట్లే కనిపిస్తోంది సన్నివేశం. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ధర్మ ప్రొడక్షన్స్ లో %-%దడక్%-% తో లాంచ్ అయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ చేసిన సినిమాలు 13. వాటిలో రెండు సినిమాలు గెస్ట్ అపీరియన్స్ లు తీసేస్తే 11. మరి వీటిలో ఎన్ని సినిమాలు విజయం సాధించాయంటే? చెప్పడం కష్టమే. %-%ధడక్%-% యావరేజ్ గా ఆడింది. గుంజన్ సక్సేనా బయోగ్రఫీలో నటించినా వర్కౌట్ అవ్వలేదు. ఓ మంచి ప్రయత్నం చేసిందనే ప్రశంస తప్ప ఆ సినిమా ద్వారా జాన్వీ సాధించింది ఏం లేదు. మిగతా సినిమాల గురించి చెప్పాల్సిన పనిలేదు. అన్ని ఒకదానికొకటి పోటీ పడి మరీ ఫ్లాప్ రికార్డులు అందించిన చిత్రాలే. టాలీవుడ్ లో %-%దేవర%-%తో లాంచ్ అయింది. ఇక్కడైనా గ్రాండ్ విక్టరీ కొట్టిందంటే? అదీ లేదు. %-%దేవర%-% డివైడ్ టాక్ తోనే నడించింది. ఎన్టీఆర్ ఇమేజ్ తో సోసోగా ఆడిన చిత్రం. మరి తంగ పాత్ర పరంగానైనా మార్క్ వేసిందా? అంటే అదీ లేదు. అమ్మడి పాత్రకు అందులో పెద్దగా స్కోప్ లేదు. పరిమితంగానే తెరపై కనిపించింది. ఓవరాల్ గా మెంత్తం సినిమాలన్నింటి లో ఉత్తమ నటి అనే ప్రశంస ఏ సినిమాకైనా దక్కిందా? అంటే అదీ లేదు. కొంత మంది నటీమణులు నటించిన సినిమాలు పెయిలైనా పాత్రల పరంగా తమ ముద్ర వేస్తారు. జాన్వీ ఆవి షయంలో కూడా వెనుకబడే ఉంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మామ్ ఇమేజ్ తో- డాడ్ ప్రోత్బబ లంతో అవకాశాలు అందుకోవడం తప్ప జాన్వీ సాధించిందేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల రిలీజ్ అయిన %-%పరమ్ సుందరి%-% కూడా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. ఈ సినిమా పై జాన్వీ కూడా చాలా ఆశలే పెట్టుకుంది. కానీ అవన్నీ తప్పాయి. ఇక జాన్వీ చేతిలో ఉన్నది %-%పెద్ది%-% అనే పాన్ ఇండియా చిత్రం ఒక్కటే. ఈ సినిమాతోనైనా కపూర్ బ్యూటీ తన బ్రాండ్ వేస్తుందా? గూగూల్-ఏఐల్లో ర్యాంక్ ను రిజిస్టర్ చేస్తుందా? అన్నది చూడాలి.





Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986